మంచి చేసే వారిని ప్రోత్సహించాలి: ఉప రాష్ట్రపతి



'అరివుక్కూడం ఆరాయిచ్చి పూంగా' నిర్మాణానికి శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న సీపీ రాధాకృష్ణన్

విల్లివాక్కం, న్యూస్‌టుడే: మంచి వారిని ప్రోత్సహిస్తే సమాజం అభివృద్ధి చెందుతుందని భారత ఉప రాష్ట్రపతి సీపీ రాధాకృష్ణన్ పేర్కొన్నారు. ఈరోడ్ జిల్లా పెరుందురైలోని 'ది కొంగు వేళాళర్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ ట్రస్టు' వ్యవస్థాపక దినోత్సవం శనివారం ఘనంగా జరిగింది. ప్రత్యేక అతిథిగా పాల్గొన్న ఉప రాష్ట్రపతి సీపీ రాధాకృష్ణన్ 'అరివుక్కూడం ఆరాయిచ్చి పూంగా' నిర్మాణానికి శిలాఫలకాన్ని ఆవిష్కరించారు. అనంతరం ఆయన ప్రసంగిస్తూ.. ఎవరు మంచి చేసినా ప్రశంసించాలని, అప్పుడే సమాజం అభివృద్ధి చెందుతుంది అనడానికి ఈ విద్యా ట్రస్టే ఉదాహరణ అని తెలిపారు. కార్యక్రమంలో రాష్ట్ర ఇన్‌ఛార్జి గవర్నర్ ఆర్వీ ఆర్లేకర్, సుప్రీం కోర్టు న్యాయమూర్తి జస్టిస్ ఎంఎం సుందరేశ్ తదితరులు పాల్గొన్నారు.

స్టాలిన్‌కు జెడ్ కేటగిరీ భద్రత పునరుద్ధరించాలి: తిరుమా

సైదాపేట, న్యూస్‌టుడే: స్టాలిన్‌కు జెడ్ కేటగిరీ భద్రత పునరుద్ధరించాలని వీసీకే అధ్యక్షుడు తిరుమావళవన్ తెలిపారు. తిరుచ్చిలో ఆయన విలేకర్లతో మాట్లాడుతూ... శాసన విధాన నివేదికల్లో చేర్చిన అంబేడ్కర్, పెరియార్, జవహర్‌లాల్ నెహ్రూ తదితర గొప్ప నాయకుల పేర్లు విస్మరించారని, ఇది ఉద్దేశపూర్వకంగా జరిగిందా? అనే ప్రశ్న తలెత్తిందని తెలిపారు. దీనికి బాధ్యతాయుత అధికారులు, మంత్రులు తగిన వివరణ ఇస్తారని ఆశిస్తున్నానని అన్నారు. మున్ముందు ఇలా జరుగకుండా చూడాలని పేర్కొన్నారు. మాజీ ముఖ్యమంత్రి స్టాలిన్‌కు జెడ్ కేటగిరీ భద్రత ఉపసంహరించుకోవడం సరికాదని, ఆయనకు మళ్లీ కల్పించేందుకు తమిళనాడు ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు.

ఈనాడు తమిళనాడు
సోమవారం ఆగస్టు 31, 2026

ప్రాణాంతక వ్యాధి.. చికిత్సకెళ్లే స్తోమతేది?

● క్యాన్సర్ రోగులకు దూరమైన ఆసుపత్రి ● ఖర్చులు భరించలేక వెళ్లడం మానేస్తున్న వైనం ● తాజా పరిశోధన ఫలితాల్లో వెల్లడి

కాన్సర్ చికిత్స అంటేనే దీర్ఘకాలికమైంది. ఎన్నోసార్లు ఆసుపత్రుల చుట్టూ తిరగాల్సి ఉంటుంది. అదే ఆసుపత్రి దూరంగా ఉంటే. . అదికూడా రోగులు పిల్లలైతే.. వారికోసం తల్లిదండ్రులు పడే అవస్థ అంతా ఇంతా కాదు. ఎక్కడెక్కడి నుంచో చెన్నైకి ప్రయాణం చేయలేక కొందరు చికిత్సలను మానేసిన దాఖలాలు ఉన్నట్లు పరిశోధకులు వెల్లడిస్తున్నారు.

- ఈనాడు-చెన్నై

2005 నుంచి 2019 మధ్య 14ఏళ్ల పాటు చెన్నైలోని ఉమెన్స్ ఇండియా అసోసియేషన్స్ ద్వారా నడిచే గిండి కాన్సర్ ఇన్‌స్టిట్యూట్‌లో క్యాన్సర్ చికిత్స పొందిన పిల్లల వివరాల్ని పరిశోధకులు తీసుకున్నారు. వీటితో పాటు దిల్లీలోని ఎయిమ్స్, ఆర్‌జీసీఐ ఆసుపత్రులకు వచ్చే పిల్లల్ని కలిపి 22,328 మందిని పరిశోధన కోసం నమూనాగా ఎంచుకున్నారు. ఇందులో గిండి క్యాన్సర్ ఆసుపత్రిలో చికిత్స పొందిన 5,734మంది పిల్లల వివరాల్ని తీసుకున్నారు. పరిశోధన తర్వాత తాజాగా ఆ జర్నల్ ప్రచురితమైంది. ఇందులో పలు బాధాకర విషయాలు వెలుగుచూశాయి.

80శాతం పిల్లలకు వ్యథ



చికిత్స కోసం బయటి ప్రాంతాల నుంచి క్యాన్సర్ ఇన్‌స్టిట్యూట్‌కు చేరేందుకు చాలామందికి నాలుగున్నర గంటలకు పైగా సమయం పడుతోందని పరిశోధనలో తేలింది. చికిత్స పొందినవారిలో 80శాతం మంది పిల్లలు కనిష్ఠంగా 2 గంటలకు మించి ప్రయాణాలు చేస్తున్నారని వెల్లడైంది. ఆశ్చర్యం ఏంటంటే.. దిల్లీ ఎయిమ్స్‌కు పిల్లలతో వచ్చే కుటుంబాలు సగటున 2.31 గంటలు ప్రయాణం చేయాల్సి రాగా, ఆర్‌జీసీఐకి వచ్చేందుకు సగటున 1.49గంటలు పడుతోంది. అదే గిండిలోని క్యాన్సర్ ఇన్‌స్టిట్యూట్‌కు వచ్చే పిల్లలు ఏకంగా 2.79రెట్లు అధిక సమయం ప్రయాణించి వస్తున్నారు. ఇది ప్రాణాలకు ఇబ్బందికరమని పరిశోధకులు చెబుతున్నారు.

పేద, మధ్యతరగతివారే..

ప్రయాణ భారం, ఇతర ఖర్చులతో కుటుంబాలకు ఆర్థిక ఇబ్బందులు ఎదురవుతున్నాయని పరిశోధకులు గుర్తించారు. పేదలు, మధ్యతరగతి కుటుంబీకులు చికిత్సకు రావడంతో పనిని సైతం కోల్పోతున్నట్లు వివరించారు. పైగా క్యాన్సర్ చికిత్స పొందుతున్న పిల్లలకు ఖర్చులు పెరుగుతుండటంతో వారి తల్లిదండ్రులు చికిత్సల్ని మధ్యలోనే ఆపించేస్తున్నట్లు దృష్టికి వచ్చిందన్నారు. ఫలితంగా కొందరు పిల్లల ప్రాణాలు ప్రమాదంలో పడినట్లు తెలుసుకున్నారు. దీనిపై మరింత లోతుగా పరిశోధన చేయాల్సి ఉందని చెప్పారు.

దగ్గర్లో ఉపకేంద్రాలు అవసరం

డబ్ల్యూహెచ్‌వో ప్రమాణాల ప్రకారం క్యాన్సర్ వైద్యాన్ని కుటుంబాలకు అందుబాటులో ఉంచేలా కేంద్రాల్ని పెంచాలని పరిశోధకులు తెలిపారు. ప్రత్యేకించి గ్రామీణ ప్రాంతాల నుంచి వచ్చేవారికి దగ్గర్లో ఉండేలా జిల్లాల్లో ఉండాలని సూచించిందన్నారు. తమిళనాడులో సైతం గ్రామీణ పిల్లలకు క్యాన్సర్ చికిత్స సకాలంలో అందట్లేదని పరిశోధకులు అభిప్రాయపడ్డారు. ఫలితంగా చికిత్సలు ఆలస్యమవుతున్నాయని హెచ్చరిస్తున్నారు. ఇందుకోసం అవసరమైన చోట్ల ఉపకేంద్రాల్ని ఏర్పాటు చేయాల్సిన అవసరముందని సూచిస్తున్నారు. 2028నాటికి దేశంలోని ప్రతీ జిల్లాలో క్యాన్సర్ చికిత్సా కేంద్రం ఉండేలా చర్యలు తీసుకుంటున్నట్లు కేంద్ర ప్రభుత్వం చెబుతోందని, ఇది ఆశాజనకంగా ఉందన్నారు. ఇప్పటికే దేశంలో 19 రాష్ట్ర క్యాన్సర్ కేంద్రాలు, 20 ద్వితీయస్థాయి కేంద్రాల నిర్మాణాన్ని ప్రారంభించినట్లు వివరించారు. క్యాన్సర్ ఇన్‌స్టిట్యూట్‌కు చెందిన వెంకటరామన్ రాధాకృష్ణన్, రాజారామన్ స్వామినాథన్ పరిశోధక బృందంలో ఉన్నారు. వీరితో పాటు పుణెలోని అసోసియేషన్ ఫర్ సోషియల్లీ అప్లికేబుల్ రిసెర్చ్, పశ్చిమబెంగాల్ కల్యాణిలోని ఎయిమ్స్, దిల్లీలోని ఎయిమ్స్, ఆర్‌జీసీఐ ఆసుపత్రులకు చెందిన పరిశోధకులు పాల్గొన్నారు.

అఖిలపక్ష సమావేశం ఏర్పాటు చేయాలి

అన్బుమణి


అవగాహన ర్యాలీలో అన్బుమణి దంపతులు

సైదాపేట, న్యూస్‌టుడే: మేకెదాటు వ్యవహారంలో అఖిలపక్ష సమావేశం ఏర్పాటు చేయాలని పీఎంకే అధ్యక్షుడు అన్బుమణి రామదాస్ డిమాండ్ చేశారు. ఆదివారం ఆయన విడుదల చేసిన ప్రకటనలో... మేకెదాటు ఆనకట్ట నిర్మాణ పనులు వేగవంతం చేస్తామని, ఇందుకు అనుమతి కోరుతూ త్వరలో కేంద్ర ప్రభుత్వంతో మాట్లాడనున్నట్లు కర్ణాటక ముఖ్యమంత్రి డీకే శివకుమార్ తెలిపారని అన్నారు. తమిళనాడు ప్రజలు తీవ్రంగా వ్యతిరేకిస్తున్న నేపథ్యంలో కర్ణాటక ముఖ్యమంత్రి వ్యాఖ్యలు ఖండించదగినవని చెప్పారు. ఆయన వ్యాఖ్యలు చూస్తుంటే మేకెదాటు ఆనకట్ట ఊహించనదానికంటే పెద్దగా ఉండే అవకాశం ఉందన్నారు. ఒకవేళ ఆనకట్ట నిర్మిస్తే తమిళనాడు, ముఖ్యంగా కావేరి డెల్టా జిల్లాలపై ప్రభావం ఊహించలేనంతగా ఉంటుందని పేర్కొన్నారు. భవిష్యత్తులో మేకెదాటు ఆనకట్ట ప్రకృతి వైపరీత్యానికి గురైతే దిగువన ఉండే తమిళనాడుకు నష్టమని తెలిపారు. ఇదిలా ఉండగా తమిళనాడు ప్రభుత్వం మౌనంగా ఉండటం ఆమోదయోగ్యం కాదన్నారు. ఈ వ్యవహారంలో అఖిలపక్ష సమావేశాన్ని ఏర్పాటు చేసి కావేరి హక్కుల పరిరక్షణకు ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. అదేవిధంగా పల్లిక్కరణై చిత్తడి నేలల పరిరక్షణపై అన్బుమణి నేతృత్వంలో ఆదివారం చెన్నైలో అవగాహన ర్యాలీ జరిగింది. ఇందులో ఆయన సతీమణి, పశుమై తాయగం అధ్యక్షురాలు సౌమ్యా అన్బుమణి, విద్యార్థులు, యువత పాల్గొన్నారు.

219 మంది తమిళులు సురక్షితం: మంత్రి రాజ్‌మోహన్


మీడియా ప్రతినిధులతో మాట్లాడుతున్న రాజ్‌మోహన్

చెన్నై, న్యూస్‌టుడే: నేపాల్ వరదల్లో చిక్కుకున్న తమిళుల్లో 219 మంది సురక్షితంగా ఉన్నారని మంత్రి రాజ్‌మోహన్ తెలిపారు. నేపాల్ వరదల్లో చిక్కుకున్న రాష్ట్రానికి చెందినవారికి అందిస్తున్న సహాయక చర్యలను సమీక్షించడానికి మంత్రులు ఆదవ్ అర్జున, రాజ్‌మోహన్, తెన్నరసు, వినోద్‌లతో కూడిన బృందం దిల్లీ వెళ్లిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో శనివారం రాత్రి దిల్లీ నుంచి విమానం ద్వారా మంత్రులు రాజ్‌మోహన్, వినోద్ చెన్నై చేరుకున్నారు. విమానాశ్రయంలో మీడియా ప్రతినిధులతో రాజ్‌మోహన్ మాట్లాడుతూ... దిల్లీలో మకాం వేసి నేపాల్‌లో జరుగుతున్న సహాయక చర్యలను సమీక్షించామని తెలిపారు. భారత్-నేపాల్ దేశాలు సంయుక్తంగా చేపట్టే సహాయక చర్యలు, కేంద్ర ప్రభుత్వంతో కలిసి తమిళనాడు ప్రభుత్వం చేపట్టాల్సిన చర్యలను వేగవంతం చేశామన్నారు. తమిళనాడు నుంచి పలు బృందాలుగా 319 మంది నేపాల్ వెళ్లారని, వారిలో 219 మంది సురక్షితంగా ఉన్నారని తెలిపారు. వారిని సోమవారం రాత్రిలోగా రాష్ట్రానికి తీసుకొస్తామని పేర్కొన్నారు. మిగతా 100 మంది కోసం గాలింపు చర్యలు ముమ్మరంగా జరుగుతున్నాయని తెలిపారు. కుంభకోణం ఏజెన్సీ ద్వారా యాత్రకు వెళ్లిన 21 మంది సురక్షితంగా చెన్నైకు వచ్చిన నేపథ్యంలో మిగతా 36 మందిని వెతికే పనులు జరుగుతున్నాయని పేర్కొన్నారు. మహాదేవి యాత్ర ద్వారా నేపాల్ వెళ్లిన 49 మంది జాడ ఇప్పటివరకు తెలియలేదన్నారు. ప్రస్తుతం మంత్రి తెన్నరసు మాత్రం దిల్లీలోనే ఉండి సహాయక చర్యలను సమీక్షిస్తున్నారని తెలిపారు.

మార్పును జీర్ణించుకోలేకపోతున్న డీఎంకే

కాంగ్రెస్

సైదాపేట, న్యూస్‌టుడే: మార్పును జీర్ణించుకోలేక డీఎంకే నిందారోపణ రాజకీయాలు చేస్తోందని కాంగ్రెస్ ధ్వజమెత్తింది. కాంగ్రెస్ పార్టీ తమిళనాడు విభాగ కోశాధికారి రూబీ మనోహర్ మాట్లాడుతూ... ప్రజల తీర్పును డీఎంకే, దాని ప్రతినిధులు జీర్ణించుకోలేక పోతున్నారని, మొదట వారు తమ గత విధాన ప్రకటనలు తెరచి చూసుకోవాలని పేర్కొన్నారు. డీఎంకే మాజీ ఎమ్మెల్యే పరందామన్ మాట్లాడేముందు ఆధారాలు తెచ్చుకుని వాస్తవాలు సరిచూసుకోవాలని అన్నారు. గత డీఎంకే పాలనలో మంత్రి రాజకన్నప్పన్ దాఖలు చేసిన అధికారిక విధాన పత్రాలలో నెహ్రూ, అంబేడ్కర్ పేరు ఎక్కడా లేదన్నదే నిదర్శనం అని తెలిపారు. సత్యమూర్తిభవన్ పేరు మార్చమని చెప్పేందుకు మీకు ఏం అర్హత ఉందని ప్రశ్నించారు. ఎన్నికల ఓటమి భయంతో మీ సౌలభ్యం కోసం నేడు నెహ్రూ, అంబేడ్కర్ల పేర్లు ఉపయోగిస్తున్నారని, మీరు అరివాలయం పేరు ఏమని మారుస్తారని అడిగారు. ప్రజా తీర్పును జీర్ణించుకోలేని డీఎంకే చేస్తున్న చౌకబారు రాజకీయాలు ఇకపై పని చేయవని తెలిపారు.

వారి పేర్లు ఉద్దేశపూర్వకంగా తొలగించలేదు

వేళచ్చేరి, న్యూస్‌టుడే: రిజర్వేషన్ల మంజూరు అభ్యర్థన నివేదికల నుంచి సామాజిక న్యాయం కోసం పోరాడిన నాయకుల పేర్లను ప్రభుత్వం ఉద్దేశపూర్వకంగా తొలగించలేదని, వారి పేర్లను త్వరలో చేర్చుతామని పాఠశాల విద్యాశాఖ మంత్రి రాజ్‌మోహన్ పేర్కొన్నారు. పెరంబలూర్ జిల్లా కలెక్టర్ కార్యాలయంలో లబ్ధిదారులకు సంక్షేమ సాయం పంపిణీ, వివిధ శాఖల కింద నిర్మించిన కొత్త భవనాల ప్రారంభోత్సవం ఆదివారం జరిగింది. పాల్గొన్న మంత్రి రాజ్‌మోహన్ లబ్ధిదారులకు సంక్షేమ సాయం పంపిణీ చేసి రూ.4.14 కోట్ల వ్యయంతో నిర్మించిన 13 భవనాలను ప్రారంభించారు. అనంతరం విలేకర్లతో మాట్లాడుతూ.. రిజర్వేషన్ల మంజూరు అభ్యర్థన నివేదికల నుంచి సామాజిక న్యాయ పోరాట నాయకుల పేర్లను ఉద్దేశపూర్వకంగా తొలగించలేదన్నారు. గత ప్రభుత్వంలో తొలగించారా? లేదా? అని తాము పరిశీలించామని, ఆ మేరకు డీఎంకే ప్రభుత్వ హయాంలో 3 ఏళ్లుగా జవహర్‌లాల్ నెహ్రూ, పెరియార్, అంబేడ్కర్ తదితర పేర్లను రిజర్వేషన్ల పథకంలో చేర్చలేదన్నారు. ఇది ఎలా జరిగిందో తెలియదన్నారు. ప్రభుత్వ రంగంలో పనిచేస్తున్న మహిళలకు రుతుస్రావ సెలవులపై కోర్టు తన అభిప్రాయాన్ని వెల్లడించిందని, దానిని రాష్ట్ర ప్రభుత్వం పరిశీలించనుందని తెలిపారు. అదేవిధంగా ద్విభాషా విధానానికి ప్రభుత్వం కట్టుబడి ఉందని, ఆ విషయంలో వెనక్కి తగ్గే ప్రసక్తి లేదన్నారు.



దెబ్బతిన్న తెలుగుగంగ కాలువ గట్లు

ఊత్తుకోట, న్యూస్‌టుడే: తిరువళ్లూర్ జిల్లా ఊత్తుకోట సమీపం తామరైకుప్పం జీరో పాయింట్ నుంచి పూండి చెరువు వరకు 25 కిలోమీటర్ల దూరానికి తెలుగుగంగ కాలువ ఉంది. తామరైకుప్పంతో పాటు 20 ప్రాంతాల్లో కాలువ గట్లు దెబ్బతిన్నాయి. దీంతో కాలువకు గండి పడే ప్రమాదం ఉంది. సంబంధిత అధికారులు వెంటనే గట్లను బలోపేతం చేసేందుకు చర్యలు చేపట్టాలని రైతులు కోరుతున్నారు.

49 మంది పరిస్థితిపై సమాచారం ఇవ్వండి


ఆందోళన చేస్తున్న బాధితుల బంధువులు

మామల్లపురం: నేపాల్ వరదల్లో చిక్కుకున్న ఒకే కుటుంబానికి చెందిన ఆరుగురు సహా 49 మంది పరిస్థితిపై ప్రభుత్వం సమాచారం ఇవ్వాలని డిమాండ్ చేస్తూ వారి బంధువులు క్రోంపేట జీఎస్టీ రోడ్డులో ఆదివారం ఉదయం నిరసన చేపట్టారు. చెన్నై క్రోంపేటలోని ఓ ప్రైవేట్ ట్రావెల్స్ కంపెనీ ద్వారా కైలాష్ మానస సరోవర్ యాత్రకు వెళ్లిన వారిలో తమిళనాడుకు చెందిన 49 మంది ఉన్నారు. వీరిలో క్రోంపేట, జమీన్ రాయపేట, అంబత్తూర్ ప్రాంతాలకు చెందిన 8 మంది ఉన్నారు. అయితే క్రోంపేటకు చెందిన ఒకే కుటుంబంలోని ఆరుగురి గురించి ఇప్పటివరకు ఎలాంటి సమాచారం బంధువులకు అందలేదు. దీంతో ఆ 49 మంది గురించి తెలుసుకోవడానికి ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ నిరసన చేపట్టారు.

ముగిసిన సివిల్ సర్వీసెస్ మెయిన్ పరీక్షలు

సైదాపేట, న్యూస్‌టుడే: యూపీఎస్సీ నిర్వహించే సివిల్ సర్వీసెస్ మెయిన్ ఈ నెల 21 నుంచి 23వ తేదీ వరకు, 29 నుంచి 30వ తేదీ వరకు జరిగాయి. చివరి రోజైన ఆదివారంతో పరీక్షలు ప్రశాంతంగా ముగిశాయి. ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు, సాయంత్రం 2.30 నుంచి 5.30 గంటల వరకు జరిగాయి. దివ్యాంగులకు గంట అదనపు సమయం కల్పించారు. చెన్నై జిల్లాలో మూడు పరీక్ష కేంద్రాలు ఏర్పాటు చేశారు. 651 మంది దరఖాస్తు చేసుకోగా 642 మంది హాజరయ్యారు. ఇందులో 13 మంది దిగ్వ్యాంగులు ఉన్నారు. కేంద్ర ప్రభుత్వ ఎగ్జామ్స్ బోర్డు నుంచి ఓ అధికారి, రాష్ట్ర ప్రభుత్వ నుంచి ఓ ఐఏఎస్ అధికారి పర్యవేక్షించారు. ముఖ ఆధారిత యాప్ ద్వారా అభ్యర్థుల హాల్ టికెట్‌లోని ఫొటో, పరీక్షకు హాజరైనవారి ఫొటోలను సరిచూసి పరీక్ష హాలులోకి అనుమతించారు.


వెంకట్ గరికపాటిని జ్ఞాపికతో సత్కరిస్తున్న కందనూరు మధు, జేకే రెడ్డి


హాజరైన సభికులు

వైవిధ్యభరిత వాగ్గేయకారుడు అన్నమయ్య

టీనగర్, న్యూస్‌టుడే: తెలుగు పాట విశిష్టతను, పదకవితా వైభవాన్ని ప్రపంచానికి చాటి చెప్పిన మహనీయుడు తాళ్లపాక అన్నమాచార్యులని, ఆయన వైవిధ్యభరితమైన వాగ్గేయకారుడని వ్యాఖ్యాన విశారద వెంకట్ గరికపాటి కొనియాడారు. వేద విజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో ప్రతీ నెలా నిర్వహిస్తున్న తరతరాల తెలుగు కవిత ఉపన్యాస ధారావాహికలో భాగంగా ఆదివారం 176వ ప్రసంగ కార్యక్రమం చెన్నైలోని టీనగర్ ఆంధ్రా క్లబ్‌లోని కృష్ణా హాలు వేదికగా జరిగింది. కార్యక్రమానికి ముఖ్య వక్తగా హాజరైన వెంకట్ గరికపాటి.. ఈ మాసం అంశం 'అన్నమయ్య సాహితీ సౌరభం'పై ప్రసంగించారు. పల్లవి, చరణాలతో కూడిన తెలుగు పాటకు ప్రాణప్రతిష్ఠ చేసిన ఘనుడు అన్నమయ్య అని పేర్కొన్నారు. ముందుగా వేద విజ్ఞాన వేదిక కార్యదర్శి కందనూరు మధు, అధ్యక్షుడు జేకే రెడ్డి వక్తను జ్ఞాపికతో సత్కరించారు.

తెలియని ప్రొఫెసర్ ఆచూకీ


తంగమది

సైదాపేట: దిండుక్కల్ కల్లిపట్టికి చెందిన పెరుమాళ్, పూంగొడి దంపతుల కుమార్తె తంగమది(49) తంజావూర్‌లో నివసిస్తున్నారు. ఆమె అక్కడుండే నాచ్చియార్ ప్రభుత్వ బాలికల కళాశాలలో ప్రొఫెసర్‌గా పనిచేస్తున్నారు. కుంభకోణంలోని ప్రైవేటు సంస్థ తరఫున కైలాస మానససరోవర యాత్రకు వెళ్లారు. 26వ తేదీ ఉదయం కుటుంబ సభ్యులతో చివరిగా ఫోన్లో మాట్లాడారు. వరదలు సంభవించిన తర్వాత ఇప్పటివరకు ఆమె ఆచూకీ తెలియలేదని కుటుంబ సభ్యులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తండ్రి పెరుమాళ్ తంజావూర్ కలెక్టర్ కార్యాలయం, సచివాలయం, చెన్నైలోని నేపాల్ రాయబార కార్యాలయాల్లో తంగమది ఫొటో, వివరాలు ఇచ్చారు.


అన్నాడీఎంకే హయాంలో ప్రవేశపెట్టిన 7.5 శాతం రిజర్వేషన్ కోటాలో వైద్య విద్య సీటు పొందిన సేలం జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు అన్నాడీఎంకే ప్రధాన కార్యదర్శి ఎడప్పాడి పళనిసామిని ఆదివారం కలిసి కృతజ్ఞతలు తెలియజేసి అభినందనలు పొందారు. – న్యూస్‌టుడే, సైదాపేట

10.5శాతం రిజర్వేషన్ డిమాండ్‌తో త్వరలో అసెంబ్లీ ముట్టడి: జె.గురు పీఎంకే



విలేకర్లతో మాట్లాడుతున్న మనోజ్

సైదాపేట, న్యూస్‌టుడే: వన్నియర్లకు 10.5 శాతం రిజర్వేషన్ డిమాండ్ చేస్తూ త్వరలో అసెంబ్లీని ముట్టడిస్తామని జె.గురు పీఎంకే ప్రకటించింది. చెన్నై చేపాక్కంలో జె.గురు పీఎంకే ముఖ్య కార్యదర్శి మనోజ్ విలేకర్లతో మాట్లాడుతూ... ఎడప్పాడి పళనిసామి నేతృత్వంలోని అన్నాడీఎంకే ప్రభుత్వం వన్నియర్లకు 10.5 శాతం రిజర్వేషన్ కల్పించిందని తెలిపారు. అయితే అది ఇంతవరకు అమలు రాలేదని పేర్కొన్నారు. గత డీఎంకే పాలనలోనూ, ప్రస్తుత టీవీకే పాలనలోనూ దీని గురించి డిమాండ్ చేస్తున్నామని అన్నారు. ఇది 40ఏళ్ల కోరికగా తెలిపారు. దీని గురించి అసెంబ్లీలో చర్చ జరగ్గా ముఖ్యమంత్రి విజయ్ ఏమీ మాట్లాడలేదని అసంతృప్తి వ్యక్తం చేశారు. అది తమకు వేదనగా ఉందని తెలిపారు. 10.5 శాతం రిజర్వేషన్ డిమాండ్‌తో అసెంబ్లీని ముట్టడిస్తామని పేర్కొన్నారు.

లక్షల్లో పెట్టుబడులు.. వేలల్లో బాధితులు


పోలీసులకు అందిన ఫిర్యాదుపత్రాలు

ప్యారిస్, న్యూస్‌టుడే: డబ్బుల కోసం ఆశపడి పెట్టుబడి పెట్టిన వేలాది మంది మోసపోయిన సంఘటన మదురై జిల్లాలో చోటుచేసుకుంది. మదురై జిల్లా మేలూర్, చుట్టుపక్కల ప్రాంతాల్లో కొన్ని నెలలుగా కొంతమంది.. 'ఎఫ్‌క్యూఎల్' అనే ఫైనాన్స్ సంస్థ తరఫున మొబైల్ యాప్ ద్వారా నగదుని రెట్టింపు చేసుకోవచ్చని ఆకర్షణీయ ప్రకటనలు చేశారు. ముఖ్యంగా మహిళలకు మాయమాటలు చెప్పారు. ఇందుకుగాను ఏజెంట్‌లు పనిచేశారు. నమ్మిన వేలాది మంది పెట్టుబడి పెట్టారు. కానీ చెప్పిన విధంగా డబ్బులు ఇవ్వలేదు. దీంతో మోసపోయినట్లు గ్రహించిన పెట్టుబడిదారులు శుక్రవారం ఆందోళన చేపట్టారు. అనంతరం జిల్లా ఎస్పీ దేవనాథన్ పర్యవేక్షణలో శనివారం మూడు చోట్ల బాధితులు ఫిర్యాదు చేసేందుకు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. మొత్తం 3 వేలకి పైగా ఫిర్యాదులు అందాయి. ఆదివారం కూడా పెద్ద సంఖ్యలో ఫిర్యాదులు ఇచ్చేందుకు వచ్చారు. ఒక్కొక్కరు రూ.5 లక్షల వరకు పెట్టుబడి పెట్టినట్లు సమాచారం.

10 కోట్లు దాటిన ఆన్‌లైన్ విద్యుత్ బిల్లుల చెల్లింపుదారులు

గిండి, న్యూస్‌టుడే: ఆన్‌లైన్‌లో విద్యుత్ బిల్లుల చెల్లింపుదారుల సంఖ్య 10 కోట్లు దాటినట్లు విద్యుత్ బోర్డు తరఫున ప్రకటన విడుదలైంది. 2024-25 సంవత్సరంలో 9.56 కోట్ల మంది రూ.58,285 కోట్లను ఆన్‌లైన్ ద్వారా చెల్లించగా, 2025-26 సంవత్సరంలో 10.63 కోట్ల మంది వినియోగదారులు రూ.62,537 కోట్లను చెల్లించారని వెల్లడించింది. చెల్లింపుదారులు ఏటా 10 నుంచి 15శాతం పెరుగుతున్నారని పేర్కొంది. ఈ సంఖ్య ఇంకా పెరిగే అవకాశం ఉందని తెలిపింది.

విమానాశ్రయ విస్తరణపై దృష్టి

● ఐదో టెర్మినల్‌కు బైపాస్ రోడ్డు అనుసంధానం ● సాధ్యాసాధ్యాలపై రాష్ట్ర ప్రభుత్వం అధ్యయనం

– న్యూస్‌టుడే, వడపళని



చెన్నై అంతర్జాతీయ విమానాశ్రయంలోని 'వైడ్ ఎండ్' రన్‌వేల చివరన ప్రతిపాదిత శాటిలైట్ టెర్మినల్‌ను అడయార్ నది సహజ ప్రవాహానికి, అలాగే ఆ ప్రాంతంలోని నివాస ప్రాంతాలకు ఎలాంటి ఆటంకం కలగకుండా తాంబరం-మధురవోయల్ బైపాస్‌తో అనుసంధానం చేయడంపై సాధ్యాసాధ్యాలను రాష్ట్ర ప్రభుత్వం పరిశీలిస్తోంది. కార్యదర్శి స్థాయి ఉన్నతాధికారులు భారత విమానాశ్రయాల ప్రాధికార సంస్థ(ఏఏఐ) అధికారులతో ఇటీవల సమావేశమయ్యారు. ప్రతిపాదిత ఐదో టెర్మినల్, దాని అమలుపై వివరంగా చర్చలు జరిగాయని సమాచారం. పరందూర్ గ్రీన్ ఫీల్డ్ విమానాశ్రయ ప్రాజెక్టును టీవీకే ప్రభుత్వం అధికారికంగా పక్కన పెట్టడంతో ప్రస్తుతం విమానాశ్రయ విస్తరణపై దృష్టి సారించారు. తాంబరం-మధురవోయల్ బైపాస్ రోడ్డుకు అనుసంధానంతో ఒక శాటిలైట్ టెర్మినల్‌ను నిర్మిస్తామని ముఖ్యమంత్రి జోసెఫ్ విజయ్ స్వయంగా ప్రకటించారు.

4 కి.మీ మార్గానికి ఏఏఐ ప్రతిపాదన

టెర్మినల్ నిర్మాణానికి అదనపు భూమి అవసరం లేనప్పటికీ, బైపాస్ రోడ్డుతో అనుసంధానించడానికి నాలుగు కిలోమీటర్ల ఎలివేటెడ్ కారిడార్ నిర్మించాలని ఏఏఐ ప్రతిపాదించింది. అయితే మార్గమధ్యంలో ఉన్న పొళిచ్చలూర్, తారపాక్కం వంటి ప్రాంతాల ప్రజలకు కూడా అందుబాటులో ఉండేలా ఈ రోడ్డును భూస్థాయిలోనే నిర్మించాలని 'చెన్నై యూనిఫైడ్ మెట్రోపాలిటన్ ట్రాన్స్‌పోర్ట్ అథారిటీ(సీయూఎంటీఏ)' సూచించింది. 2015లో మాదిరిగా మళ్లీ వరదలు సంభవిస్తే పరిసరాలకు, విమానాశ్రయానికి నష్టం కలగకుండా నది నీరు సహజ మార్గంలోనే ప్రవహించేలా చూస్తున్నట్లు అధికార వర్గాలు పేర్కొన్నాయి.

నిర్వహణ సామర్థ్యం పెంపు

శాటిలైట్ టెర్మినల్ ద్వారా చెన్నై విమానాశ్రయం ప్రయాణికుల నిర్వహణ సామర్థ్యం ఏడాదికి 35 నుంచి 55 మిలియన్లకు పెరుగుతుందని అధికారుల అంచనా. దీనికి తోడు వేగవంతమైన ట్యాక్సీవే నెట్‌వర్క్‌తో గంటకు 35 నుంచి 45 విమానాల రాకపోకలు కూడా పెరుగుతాయని అంటున్నారు. శాటిలైట్ టెర్మినల్‌తో పాటు సరకుల నిర్వహణకు వీలుగా సదుపాయాలుంటాయని విమానాశ్రయ అధికారులు తెలిపారు. విమానాశ్రయానికి ప్రవేశించే, నిష్క్రమించే ప్రయాణికులకు, సరకుల కోసం మాత్రమే రోడ్డు అనుసంధానం ఉంటుందని, ప్రణాళికలో అవసరమైన మార్పులు చేయడానికి తమ వద్ద ఓ నిపుణుల బృందం ఉందని ఏఏఐ పేర్కొంది. రాష్ట్ర ప్రభుత్వం తుది ఆమోదం తెలిపిన వెంటనే పనులు ప్రారంభమవుతాయని అధికారి ఒకరు పేర్కొన్నారు.

ప్రభుత్వ ఉద్యోగుల మధ్యంతర సాయం నిబంధనల్లో సవరణ

చెన్నై, న్యూస్‌టుడే: ప్రభుత్వ ఉద్యోగుల మధ్యంతర సాయం నిబంధనల్లో సవరణ చేసినట్లు రాష్ట్ర ఆర్థికశాఖ అదనపు ప్రధాన కార్యదర్శి ఎం.ఎ.సిద్ధిఖ్ తెలిపారు. ఆయన విడుదల చేసిన ప్రకటనలో... 2026 జనవరి 1వ తేదీ లేక దానికి ముందుగా ఉద్యోగ విరమణ చెందినవారు, ఉద్యోగ సమయంలో మరణించినవారు, కంట్రిబ్యూటరీ పెన్షన్ స్కీమ్‌లో అర్హులైన ప్రభుత్వ ఉద్యోగులకు నెలవారీ మధ్యంతర సాయం, కుటుంబ ఆర్థికసాయం అందజేత జీవోను ఈ ఏడాది జూన్ 16న జారీ చేసినట్లు తెలిపారు. ఆ మేరకు చివరిగా పొందిన కనీస వేతనంలో 30శాతం లేక రూ.10వేలు వీటిలో ఏది ఎక్కువైతే దానితో పాటు 60శాతం డీఏను అందించినట్లు పేర్కొన్నారు. ఆరో వేతన సంఘం కింద వేతనం పొంది ఉద్యోగ విరమణ పొందినవారికి ఈ ఏడాది జనవరి 1వ తేదీ నుంచి డీఏ 262శాతం కావడంతో ఇందులో సవరణ చేసి ప్రస్తుతం కొత్త జీవోను జారీ చేస్తున్నట్లు తెలిపారు. ఆ మేరకు ఆరో వేతన సంఘం కింద చివరిగా పొందిన వేతనం, 30శాతం కనీస వేతనం రూ.10వేలు కన్నా ఎక్కువ ఉండి, 7వ వేతన సంఘానికి మార్చని ఉద్యోగులకు డీఏను 262 శాతం అందించనున్నట్లు పేర్కొన్నారు. ఆరో వేతన సంఘం కింద 30శాతం కనీస వేతనం రూ.10వేలు కన్నా తక్కువగా ఉంటే, మధ్యంతర కనిష్ఠ మొత్తం రూ.10వేలుగా పెంచి 60 శాతం డీఏను అందించనున్నట్లు తెలిపారు. ఏడో వేతన సంఘం కింద వేతనం పొందిన ప్రభుత్వ ఉద్యోగులకు 60 శాతం మాత్రమే డీఏ లెక్కించనున్నట్లు పేర్కొన్నారు.

వైభవంగా ఆలయ మహా కుంభాభిషేకం


కుంభాభిషేకం నిర్వహిస్తున్న శివాచార్యులు

కాంచీపురం, న్యూస్‌టుడే: కాంచీపురం జిల్లా మధురమంగళం సమీపంలోని కీరానల్లూర్ గ్రామంలో ఉన్న పళాండి అమ్మవారి ఆలయంలో చేపట్టిన జీర్ణోద్ధరణ పనులు ముగిశాయి. దీంతో ఆదివారం ఉదయం మహా కుంభాభిషేకాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా యాగ పూజలను నిర్వహించి పూజలో ఉంచిన కలశాల్లోని పుణ్య జలాలను ఊరేగింపుగా తీసుకెళ్లి ఆలయ గోపుర కలశాలపై అభిషేకించారు. భక్తులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

ఘనంగా అగ్నిగుండ మహోత్సవం


అగ్నిగుండం తొక్కుతున్న భక్తుడు

గుమ్మిడిపూండి, న్యూస్‌టుడే: తిరువళ్లూర్ జిల్లా పొన్నేరి సమీపం తిరుమాలైలోని ప్రసిద్ధ గంగమ్మ ఆలయంలో వారం రోజుల క్రితం అగ్నిగుండ మహోత్సవాలు ప్రారంభమయ్యాయి. ఇందులో భాగంగా శనివారం రాత్రి అమ్మవారిని పుర వీధుల్లో ఊరేగించారు. కంకణం కట్టుకుని వ్రతం ఆచరించిన భక్తులు అగ్నిగుండ ప్రవేశం చేసి మొక్కులు తీర్చుకున్నారు. పెద్ద సంఖ్యలో భక్తులు తరలివచ్చి అమ్మవారిని దర్శించుకున్నారు.

కళాకారిణి పవిత్రా శ్రీనివాసన్ చిత్రాలతో
పోస్టుకార్డుల సంకలనం విడుదల


పోస్టు కార్డులతో టీఎన్ వెంకటేశ్, జస్టిస్ ప్రభా శ్రీదేవన్, కేఆర్ఏ నరసయ్య తదితరులు

వడపళని, న్యూస్‌టుడే: కళాకారిణి, రచయిత్రి, అనువాదకురాలు దివంగత పవిత్రా శ్రీనివాసన్ సంకలనం చేసిన మద్రాసులోని (చెన్నై) ప్రసిద్ధ భవనాల చిత్రాలతో కూడిన పోస్టుకార్డుల సంకలన విడుదల కార్యక్రమం శనివారం అన్నాసాలైలోని ప్రముఖ పుస్తకాల సంస్థ హిగ్గిన్ బోథమ్స్ దుకాణంలో జరిగింది. 'మద్రాస్:ఆర్చస్, అల్లేస్ అండ్ ఐకాన్స్' పేరుతో దృక్కోణాల ద్వారా రూపొందించిన ఈ సంకలనం చెన్నై చరిత్ర, వాస్తు శిల్పాన్ని చాటుతుంది. దీన్ని 'పోస్ట్ క్రాసింగ్ వెల్ఫేర్ సొసైటీ ఆఫ్ ఇండియా, నమ్ వీడు, నమ్ ఊరు, నమ్ కథై, మద్రాస్ లిటరరీ సొసైటీ' సంయుక్తంగా విడుదల చేశాయి. ముఖ్య అతిథులుగా చేనేత, హస్తకళలు, వస్త్ర, ఖాదీ శాఖ ముఖ్య కార్యదర్శి టీఎన్ వెంకటేశ్, మద్రాస్ హైకోర్టు మాజీ న్యాయమూర్తి జస్టిస్ ప్రభా శ్రీదేవన్ చరిత్రకారుడు కేఆర్ఏ నరసయ్య పాల్గొన్నారు. పవిత్ర తండ్రి శ్రీనివాసన్ మాట్లాడుతూ.. రాయపురం, ట్రామ్‌ల గురించి ఆమె రూపొందించిన పుస్తకాన్ని తీసుకురావాలని యోచిస్తున్నట్టు ఆయన చెప్పారు. ఆమె పుస్తకాలు, ఇతర సామగ్రి అమ్మకాల ద్వారా వచ్చే ఆదాయాన్ని పేద పిల్లల పాఠశాలల ఫీజుల చెల్లింపునకు సాయపడే స్వచ్ఛంద సంస్థకు అందించనున్నట్టు పేర్కొన్నారు.

కోళ్ల పందేల నిర్వహణ చట్టవిరుద్ధం
మదురై ధర్మాసనం

ప్యారిస్, న్యూస్‌టుడే: కోళ్ల పందేల నిర్వహణ చట్టవిరుద్ధమని, అందుకు అనుమతి ఇవ్వడం కుదరదని మద్రాస్ హైకోర్టు మదురై ధర్మాసనం ఉత్తర్వులు ఇచ్చింది. తంజావూర్ జిల్లా పట్టుకోట్టైలో ఏటా సంప్రదాయంగా నిర్వహించే కోళ్ల పందేలకు 2017లో అధికారులు అనుమతి ఇవ్వలేదని పేర్కొంటూ మదురై ధర్మాసనంలో పిటిషన్ దాఖలైంది. అప్పుడు కొన్ని నిబంధనలతో పందేల నిర్వహణకు కోర్టు అనుమతిచ్చింది. ప్రభుత్వ పశు వైద్యుడు కార్యక్రమాన్ని పర్యవేక్షించాలని, కోళ్లకి గాయం ఏర్పడని విధంగా నిర్వహించాలని, కోళ్లకు మద్యం మొదలైన మత్తుపదార్థాలను ఇవ్వకూడదని, కాళ్లకు కత్తి కట్టకూడదని తదితర నిబంధనలు విధించింది. ఈ ఉత్తర్వులను పునః పరిశీలించాలని కోరుతూ తంజావూర్ జిల్లా కలెక్టరు, ఎస్పీ, పోలీసు ఇన్‌స్పెక్టరు తదితరులు కోర్టుని ఆశ్రయించారు. జంతు వధ నిషేధిత చట్టం సెక్షన్లు 3(2), 11, 28 కింద పందేల నిర్వహణకు నిషేధం విధించినట్లు ప్రభుత్వం తరఫున వాదించారు. ఆమోదించిన న్యాయమూర్తులు జస్టిస్ కార్తికేయన్, జస్టిస్ శక్తివేల్ ధర్మాసనం.. చట్టం నిషేధించిన ఓ కార్యక్రమానికి అనుమతి ఇవ్వడం సరికాదని తెలిపారు. గత అనుమతి ఉత్తర్వుల ప్రాతిపదికన భవిష్యత్తులో కోళ్ల పందేలకు అనుమతి ఇవ్వాలని పిటిషన్ దాఖలు చేయడం కుదరదని స్పష్టం చేశారు.

మంత్రి మరియ విల్సన్‌పై
కేసు నమోదు చేయాలి
అనిశాకు న్యాయవాది లేఖ

ప్యారిస్, న్యూస్‌టుడే: మంత్రి మరియ విల్సన్‌పై అవినీతి నిరోధక చట్టం కింద కేసు నమోదు చేయాలని పేర్కొంటూ అవినీతి నిరోధక శాఖకు న్యాయవాది జెనిఫర్ లేఖ రాశారు. చెన్నైకి చెందిన న్యాయవాది జెనిఫర్ భారత ఎన్నికల సంఘం, తమిళనాడు రాష్ట్ర ఎన్నికల కమిషన్, అవినీతి నిరోధకక శాఖ డైరెక్టర్ తదితరులకు రాసిన లేఖలో... గత ఏప్రిల్‌లో జరిగిన శాసనసభ ఎన్నికల్లో ఆర్కే నగర్ నియోజకవర్గంలో టీవీకే తరఫున పోటీ చేసిన మరియ విల్సన్ గెలుపొందారని, ప్రస్తుతం ఆయన ఆర్థికశాఖ మంత్రిగా వ్యవహరిస్తున్నారని తెలిపారు. ఇదిలా ఉండగా ఇటీవల శాసనసభలో ఆయన మాట్లాడుతూ.. తన విద్యా సంస్థ అనుమతి వ్యవహారమై మాజీ మంత్రికి లంచం ఇచ్చినట్లు ఆరోపించారని, ఇది రాజ్యాంగానికి విరుద్ధం మాత్రమే కాకుండా అవినీతి నిరోధక చట్టానికి సంబంధించిందని తెలిపారు. మంత్రి మరియ విల్సన్ వ్యాఖ్యలను భాజపా రాష్ట్ర అధ్యక్షుడు నయినార్ నాగేంద్రన్ ఖండించడం అన్ని మీడియాల్లో వెలువడిందని, మరియ విల్సన్ మంత్రిగా బాధ్యతలు స్వీకరించేటప్పుడు చేసిన ప్రమాణానికి, ప్రజాస్వామ్యానికి వ్యతిరేకంగా వ్యవహరించారన్నారు. ఆయన శాసనసభ నిబంధనలు పాటించలేదని, ప్రజా ప్రాతినిధ్య చట్టాన్ని పాటించలేదన్నారు. ఆయనపై అవినీతి నిరోధక శాఖ కేసు నమోదు చేయాలని, లేకుంటే కోర్టు ద్వారా తగిన చర్యలు చేపడతామని పేర్కొన్నారు.

పంటలు నాశనం చేస్తున్న అడవి పందులు


గ్రామ సమీపంలో అడవి పందులు

విల్లివాక్కం, న్యూస్‌టుడే: ధర్మపురి జిల్లా అరూర్ సమీపంలోని చిత్తేరిమలై, కీళానూర్, చెల్లంపట్టి, కీరైపట్టి, ఒడసల్‌పట్టి, కూక్కడపట్టి, వాచ్చాత్తి, దామలేరిప్పట్టి, కీళ్‌మొరప్పూర్, మరుదుపట్టి, కూచ్చనూర్, కల్లడిపట్టి, ఎం.వెలాంబట్టి తదితర ప్రాంతాలలో వరి, టమాటా, పప్పు ధాన్యాలు, చిరు ధాన్యాలు, క్రపెండలం తదితర పంటలు సాగు చేస్తున్నారు. పొలాల సమీపంలోని అటవీ ప్రాంతం నుంచి రాత్రి సమయాల్లో గుంపులుగా వస్తున్న అడవి పందులు పొలాలలో చొరబడి పంటలను ధ్వంసం చేస్తున్నాయి. వీటిని అదుపు చేయలేక రైతులు అవస్థలు పడుతున్నారు. అటవీ శాఖవారు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

స్తంభించిన సర్దార్ పటేల్ రోడ్డు విస్తరణ పనులు
రద్దీగా మారిన ఐఐటీఎం జంక్షన్

– న్యూస్‌టుడే, వడపళని


సర్దార్ పటేల్ రోడ్డు

చెన్నైలోని గిండి సర్దార్ పటేల్ రోడ్డులో ఉన్న లోక్ భవన్ నుంచి ఐటీ మదర్స్ సిగ్నల్ జంక్షన్ వరకు జరుగుతున్న రోడ్డు విస్తరణ పనులు స్తంభించిపోయాయి. గతేడాది రాష్ట్ర హైవేస్ విభాగం రూ.48 కోట్ల వ్యయంతో పనులు ప్రారంభించింది. ఆ ప్రాంతంలో అనేక చోట్ల విస్తరణ పనులు జరగాల్సి ఉండటంతో పనులు ముందుకు సాగడం లేదు. దీంతో ఐఐటీఎం జంక్షన్ వాహనాలతో రద్దీగా మారుతోంది. హైవే శాఖ ప్రధాన కార్యాలయం పరిసరాల్లోని కొన్ని ప్రాంతాలు, అన్నా వర్సిటీ, ఉన్నత విద్యా మండలి క్యాంపస్ ప్రాంతాల్లోని రోడ్లను ఇంకా చదును చేయలేదు. రహదారికి అవతలి వైపున కొన్ని భవనాలు తొలగించినా రోడ్డు వెడల్పు చేయలేదు. గాంధీ మండపం వద్ద చెట్లను నరికి సరిహద్దును గుర్తించినా పనులు మాత్రం ఇంకా ప్రారంభం కాలేదు. పనులు జరిగే ప్రాంతంలో కాంట్రాక్టర్ అందుబాటులో లేరు.

జంక్షన్ దాటేందుకు అరగంట సమయం

గిండి నుంచి కొట్టూరుపురం వైపు, ఐఐటీఎం పైవంతెన పక్కన ఉన్న రహదారిని హైవే శాఖ వెడల్పు చేసింది. కానీ ఎడమవైపునకు ఇబ్బంది లేకుండా తిరిగేందుకు ఉంచిన బారికేడ్లను తొలగించలేదు. ఎడమవైపునకు తిరిగేందుకు కొట్టూరుపురం రోడ్డులో కొన్ని చోట్ల ప్రతిపాదించిన రోడ్డు వెడల్పు పనులు ఇంకా పూర్తి కాలేదు. అదేవిధంగా గాంధీ మండపం వైపు రహదారిని ఆరు వరుసలకు వెడల్పు చేయకపోవడంతో, అడయార్ నుంచి గిండి వైపు ప్రయాణించే వాహనాలు 'ఎల్' ఆకారపు పైవంతెన వద్ద ట్రాఫిక్ రద్దీని ఎదుర్కొంటున్నాయి. సర్దార్ పటేల్ రోడ్డు, ఐటీ జంక్షన్ దాటడానికి సుమారు అరగంట వరకు పడుతోంది.

సిగ్నల్ రహిత ట్రాఫిక్

వాహనాల రద్దీపై మధ్య కైలాష్ ట్రాఫిక్ పోలీసు అధికారి ఒకరు మాట్లాడుతూ... ఐఐటీఎం జంక్షన్ వద్ద సిగ్నల్ రహిత ట్రాఫిక్ ప్రణాళికను ఏప్రిల్‌లో ప్రారంభించాల్సి ఉండగా, రోడ్డు విస్తరణ పనుల కారణంగా వాయిదా వేయాల్సి వచ్చిందని పేర్కొన్నారు. ఈ మార్గంలో గంటకు 11 వేలకు పైగా వాహనాలు తిరుగుతున్నాయని, సర్దార్ పటేల్ రోడ్డు-కొట్టూరుపురం జంక్షన్ విస్తరణ పూర్తయిన తర్వాత, గిండి నుంచి కొట్టూరుపురం వైపు వెళ్లే వాహనాలకు ఫ్రీ లెఫ్ట్, అలాగే అడయార్, ఓఎమ్మార్ నుంచి వచ్చే వాహనాలకు సర్దార్ పటేల్ రోడ్డు నుంచి కొట్టూరుపురం వైపు ఫ్రీ రైట్ సౌకర్యం కల్పించగలమని చెప్పారు. ఆరో లేన్ ఫ్రీ లెఫ్ట్‌కు వీలు కల్పిస్తుండగా, కుడి వైపు వెళ్లాలనుకునే వారు ప్రస్తుతం ఉన్న క్యారేజ్‌వేను ఉపయోగించుకునే వీలుందని, దీని వల్ల ఎలాంటి ప్రమాదాలుండవని పేర్కొన్నారు.

యూటర్న్‌కు ప్రణాళికలు

కొట్టూరుపురం నుంచి గిండి వైపు వెళ్లే వాహనాల కోసం ఎల్ పైవంతెన కింద యూటర్న్ ఏర్పాటు చేయాలని కూడా ట్రాఫిక్ పోలీసులు ప్రణాళికలు రచించారు. ఆ మేరకు బోర్డులు కూడా పెట్టారు. అయితే ఈ మార్గంలో మూడుచోట్ల రోడ్డును ఇంకా వెడల్పు చేయనందున, దీన్ని ప్రస్తుతానికి అమలు చేయలేమని, యూటర్న్ తీసుకోవడానికి వాహనాలు ఒకేచోటకు చేరితే రెండు వరుసల మార్గంలో ట్రాఫ్ రద్దీ పెరుగుతుందని పేర్కొన్నారు. తారు సేకరణలో సమస్యలు ఎదురయ్యాయని, అలాగే ముగిసిన అసెంబ్లీ ఎన్నికల సమయంలో అన్నా వర్సిటీలో 'స్ట్రాంగ్ రూమ్' ఏర్పాటు చేయడంతో రోడ్డు వెడల్పు పనులు వాయిదా వేయాల్సి వచ్చిందని, సెప్టెంబరు కల్లా పనులు పూర్తవుతాయని సంబంధిత అధికారులు చెబుతున్నారు.

నా తర్వాత కూడా సేవా కార్యక్రమాలు కొనసాగుతాయి: వైరముత్తు



ట్రిప్లికేన్, న్యూస్‌టుడే: తన తర్వాత కూడా తన సేవా కార్యక్రమాలను కుమారులు కొనసాగిస్తారని సినీ రచయిత, కవి వైరముత్తు తెలిపారు. తేని జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలల్లో తమిళ మాధ్యమంలో చదివి, ప్లస్‌టూలో అధిక మార్కులు సాధించినా పేదరికం కారణంగా కళాశాల విద్యను కొనసాగించలేని విద్యార్థులకు ఏటా వైరముత్తు ఉపకార వేతనాలను అందజేస్తున్నారు. ఈ క్రమంలో తేని జిల్లా పెరియకుళం సమీపం ఎ.పుదుపట్టిలో ఉపకార వేతనాల పంపిణీ కార్యక్రమం ఆదివారం జరిగింది. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి 8 మంది నిరుపేద విద్యార్థులను ఎంపిక చేసి వారికి రూ.20వేల చొప్పున చెక్కును అందజేశారు. తర్వాత వైరముత్తు మాట్లాడుతూ... తాను ఎవరినీ అడుక్కోలేదని, ఎవరైనా ఇస్తే వద్దు అననని పేర్కొన్నారు. తన తర్వాత తన కుమారులు ఇలాంటి ఉపకార వేతనాలు అందిస్తారని హామీ ఇచ్చారు.

వరద నివారణ పనుల పరిశీలన


వాన నీటి కాలువను పరిశీలిస్తున్న అఫ్‌దాఫ్ రసూల్

గిండి, న్యూస్‌టుడే: చెన్నై మహానగర పాలక సంస్థ(జీసీసీ) పరిధిలోని పలు ప్రాంతాల్లో వరద నివారణ పనులు జరుగుతున్నాయి. ఇందులో భాగంగా వలసరవాక్కం, ఆలందూర్ తదితర ప్రాంతాలలో జరుగుతున్న పనులను జీసీసీ సౌత్ జోన్ డిప్యూటీ కమిషనర్ అఫ్‌దాఫ్ రసూల్ ఆదివారం పరిశీలించారు. అధికారులతో చర్చించి సూచనలు చేశారు. వెంట జీసీసీ, హైవేశాఖ, జలవనరుల శాఖ, సీఎంఆర్ఎల్ అధికారులు ఉన్నారు.

వీఐటీలో పురస్కారాల ప్రదానోత్సవం



నావలర్ అవార్డులను అందజేస్తున్న బన్వరిలాల్ పురోహిత్, చిత్రంలో జి.విశ్వనాథన్ తదితరులు

కాంచీపురం, న్యూస్‌టుడే: వేలూర్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ(వీఐటీ) చెన్నై క్యాంపస్‌లో శనివారం సాయంత్రం నావలర్ చెళియన్ ఫౌండేషన్ తరఫున పురస్కారాల ప్రదానోత్సవం జరిగింది. వీఐటీ కులపతి డాక్టర్ జి.విశ్వనాథన్ అధ్యక్షత వహించారు. ముఖ్య అతిథిగా పంజాబ్ మాజీ గవర్నర్ బన్వరిలాల్ పురోహిత్ హాజరయ్యారు. ఈ సందర్భంగా త్రిపుర మాజీ ముఖ్యమంత్రి మాణిక్ సర్కార్, శ్రీ వీవీ సామినాథన్‌కు నావలర్ అవార్డులను బన్వరిలాల్ పరోహిత్ ప్రదానం చేశారు. డాక్టర్ జి.విశ్వనాథన్ మాట్లాడుతూ.. ఒక దేశంలో ప్రజల తలసరి ఆదాయాన్ని మెరుగుపరచగల అంశాల్లో విద్య కూడా ఒకటన్నారు. వీఐటీ ఉపాధ్యక్షుడు డాక్టర్ జీవీ సెల్వం తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ఎస్‌కేపీడీ పాఠశాల వార్షికోత్సవం


బహుమతులు అందుకున్న విద్యార్థులతో అతిథులు, నిర్వాహకులు

టీనగర్, న్యూస్‌టుడే: శ్రీ కన్యకాపరమేశ్వరి దేవస్థానం ఆధ్వర్యంలోని ఎస్‌కేపీడీ పాఠశాల 109వ వార్షికోత్సవం చెన్నైలో శనివారం ఘనంగా జరిగింది. పాఠశాల కరస్పాండెంట్ సోలేటి లోకయ్యన్ సుదర్శనం అధ్యక్షతన జరిగిన కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పాఠశాల పూర్వ విద్యార్థి, ఎస్ఆర్ఎం ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సైన్స్ అండ్ టెక్నాలజీ గణిత విభాగానికి చెందిన అసోసియేట్ ప్రొఫెసర్ బాలాజీ హాజరయ్యారు. విశిష్ట అతిథిగా వ్యాపారవేత్త గౌతమ్ తదితరులు పాల్గొని ప్రసంగించారు. ఎస్‌కేపీడీ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయిని లీలారాణి, ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయులు రమేశ్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా పలు పోటీల్లో విజయం సాధించిన విద్యార్థులకు అతిథులు, నిర్వాహకులు బహుమతులు అందజేశారు.

తెలుగు బ్రాహ్మణ మహాసభ అధ్యక్షుడిగా
గోటేటి వెంకటేశ్వరరావు


కొత్త కార్యవర్గంతో గోటేటి వెంకటేశ్వరరావు

టీనగర్, న్యూస్‌టుడే: తెలుగు బ్రాహ్మణ మహాసభ అధ్యక్షుడిగా గోటేటి వెంకటేశ్వరరావు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ప్రపంచ తెలుగు సమాఖ్య కార్యాలయంలో తెలుగు బ్రాహ్మణ మహాసభ వార్షిక సర్వసభ్య సమావేశం ఆదివారం ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా సంస్థ వార్షిక నివేదికను, అకౌంట్స్ వివరాలను సభ్యుల ముందు ప్రవేశపెట్టిన అనంతరం నూతన కార్యవర్గ ఎన్నికలను నిర్వహించారు. ఎన్నికల్లో గోటేటి వెంకటేశ్వరరావు ప్యానెల్ 2026 నుంచి 2028 కాలపరిమితికి గాను ఏకగ్రీవంగా ఎన్నికైంది. నూతన కార్యవర్గంలో అధ్యక్షుడిగా గోటేటి వెంకటేశ్వరరావు బాధ్యతలు స్వీకరించగా, ఉపాధ్యక్షులుగా రఘుకుమార్, ఉమాపతి, కార్యదర్శిగా ఆర్.బాలాజీ జాయింట్ కార్యదర్శి సాయినాథ్ ఎన్నికయ్యారు. అలాగే కార్యవర్గ కమిటీ సభ్యులుగా అరక్కోణం బాలు, అయ్యప్పన్, చంద్రు, సుధాకర్, భాస్కర్, గోపాలయ్య, సత్యమూర్తి, కేవీఆర్ శ్రీనివాస్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. గత 43 సంవత్సరాల సుదీర్ఘ చరిత్ర కలిగిన తెలుగు బ్రాహ్మణ మహాసభ విద్య, వసతి, వివాహం, ఉద్యోగ అవకాశాల కల్పన, తెలుగు సంస్కృతి పరిరక్షణ వంటి పలు రంగాల్లో విశేష కృషి చేస్తోంది.

అన్నామలై వర్సిటీలో నిధుల దుర్వినియోగం కేసు
మాజీ ఉప కులపతి, రిజిస్ట్రార్ విడుదల

ప్యారిస్, న్యూస్‌టుడే: చిదంబరం అన్నామలై విశ్వవిద్యాలయంలో పలు పనులు చేపట్టడంలో రూ.3.62 కోట్లు నష్టం కలిగినట్లు నమోదైన కేసులో మాజీ ఉప కులపతి, రిజిస్ట్రార్‌లను విడుదల చేస్తూ మద్రాస్ హైకోర్టు ఉత్తర్వులు జారీ చేసింది. చిదంబరం అన్నామలై వర్సిటీలో 2008, 2009, 2010, 2012 సంవత్సరాల్లో విద్యార్థుల హాస్టల్ భవనాలు, ఇతర భవనాలు, మరుగుదొడ్లు మొదలైన వాటిని చేపట్టారు. పనుల్లో అవకతవకలకు పాల్పడి వర్సిటీకి రూ.3.62 కోట్లు నష్టం కలిగించారని పేర్కొంటూ వర్సిటీ మాజీ ఉప కులపతి రామనాథన్, రిజిస్ట్రార్ రత్నసభాపతి తదితరులపై అవినీతి నిరోధక శాఖ కేసు నమోదు చేసింది. కడలూరు కోర్టులో పెండింగ్‌లో ఉన్న ఈ కేసు నుంచి తమను విడుదల చేయాలని కోరుతూ రామనాథన్, రత్నసభాపతి మద్రాస్ హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. ఈ పిటిషన్‌ను విచారించిన జస్టిస్ జీకే ఇళంతిరైయన్.. పిటిషనర్లకు వ్యతిరేకంగా ప్రభుత్వ అనుమతి లేకుండా ఈ కేసు నమోదైందని, పిటిషనర్లు వర్సిటీ నిధులను పక్కదోవ పట్టించారనడానికి ఆధారాలు లేవని పేర్కొంటూ వారిని విడుదల చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు.

విజయ్ ప్రధాని కావాలన్నదే ప్రజల అభీష్టం
మంత్రి నిర్మల్‌కుమార్

ప్యారిస్, న్యూస్‌టుడే: విజయ్ ప్రధాన మంత్రి కావాలని దేశ ప్రజలు ఇష్టపడుతున్నారని మంత్రి నిర్మల్‌కుమార్ పేర్కొన్నారు. మదురై మీనాక్షి అమ్మన్ ఆలయంలో సెప్టెంబరు 17వ తేదీ కుంభాభిషేకం జరగనున్న నేపథ్యంలో ఇందుకు సంబంధించిన పనులను మంత్రి నిర్మల్‌కుమార్ శనివారం పరిశీలించారు. అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడుతూ... కుంభాభిషేకానికి అన్ని ఏర్పాట్లు జరుగుతున్నాయని, డీఎంకే హయాంలో ఆ పార్టీ నిర్వాహకులే ధర్మకర్తల మండలిలో ఉన్నారని, కానీ టీవీకే పాలనలో అలా జరగదని తెలిపారు. ఎవరైతే ఆలయానికి పనిచేశారో వారంతా ధర్మకర్తల మండలిలో స్థానం పొందుతారని చెప్పారు. ప్రధాని అభ్యర్థి ఎంపికలో ముఖ్యమంత్రి విజయ్ మూడో స్థానంలో ఉన్న విషయమై విలేకరులు అడిగిన ప్రశ్నకు స్పందిస్తూ.. విజయ్ ప్రధాని కావాలని మొత్తం దేశ ప్రజలు ఆశిస్తున్నారని, అయినప్పటికీ ఈ విషయం గురించి మాట్లాడొద్దని తెలిపారు. జల్లికట్టు గురించి టీవీకే ఎమ్మెల్యే కరుప్పయ్య వ్యాఖ్యలపై అడిగిన ప్రశ్నకు బదులిస్తూ.. జల్లికట్టు స్టేడియాన్ని డీఎంకే ఏర్పాటు చేసింది కరుణానిధి పేరు పెట్టడానికేనని, జల్లికట్టు వినోదం కాదని, మన సంస్కృతి అన్నారు. అలా కాదని స్టేడియం కట్టి క్రీడను కించపరుస్తున్నారని, యువతను తప్పుదారి పట్టిస్తున్నారని ఆరోపించారు.

విధుల్లో ఉన్న ప్రభుత్వ ఉద్యోగుల వద్ద ఎంత డబ్బు ఉండాలి?
మదురై ధర్మాసనం

ప్యారిస్, న్యూస్‌టుడే: విధుల సమయంలో ప్రభుత్వ ఉద్యోగుల వద్ద ఎంత డబ్బు ఉండొచ్చనే విషయమై మార్గదర్శకాలను తీసుకురావాలని ప్రభుత్వానికి మద్రాస్ హైకోర్టు మదురై ధర్మాసనం సూచించింది. తిరునెల్వేలికి చెందిన కళ అనే మహిళ దాఖలు చేసిన పిటిషన్‌లో... తాను 2021లో తిరునెల్వేలి జిల్లా ముక్కూడల్‌లో సబ్ రిజిస్ట్రార్‌గా పని చేసినట్లు తెలిపారు. అప్పుడు తన కార్యాలయంలో అవినీతి నిరోధక శాఖ అధికారులు తనిఖీ చేసి రూ.45 వేలు స్వాధీనం చేసుకున్నారని, అనంతరం కేసు నమోదు చేయడంతో తనపై శాఖాపరమైన చర్యలు చేపట్టినట్లు చెప్పారు. ఆ చర్యలను రద్దు చేసేలా ఆదేశాలివ్వాలని కోరారు. ఈ పిటిషన్ శనివారం జస్టిస్ పుగళేంది ఎదుట విచారణకు రాగా పిటిషనరు తరఫున... ఆ మొత్తం వివాహ ఖర్చుల కోసం పిటిషనరు ఉంచుకున్నారని, కావున ఆమెపై శాఖాపరమైన చర్యలు రద్దు చేయాలని వాదించారు. అనంతరం న్యాయమూర్తి జారీ చేసిన ఉత్తర్వుల్లో.. అవినీతి నిరోధక శాఖ జరిపిన ఆకస్మిక సోదాల ప్రాతిపదికన ఈ కేసు నమోదైందని, ప్రభుత్వ ఉద్యోగి విధుల సమయంలో ఉంచుకోవాల్సిన నగదు ఎంత? అనే దానిపై మార్గదర్శకాలు లేదా నిబంధనలు లేవని తెలుస్తోందన్నారు. ఇదే కోర్టులో దాఖలైన కేసుల్లో కేవలం రూ.1500 ఉన్నా కూడా అవినీతి నిరోధక శాఖ కేసు నమోదు చేస్తోందన్నారు. కావున విధుల్లో ఉన్న సమయంలో ఉద్యోగులు ఉంచుకోవాల్సిన నగదుని నిర్ణయించి, ఒకే రకమైన మార్గదర్శకాలను లేదా జీవో జారీ చేయాలన్నారు. ప్రభుత్వ అన్ని నగదు లావాదేవీలు డిజిటల్ విధానంలో చెల్లిస్తున్న సమయంలో ప్రభుత్వ ఉద్యోగులు తమ అవసరానికి తీసుకొచ్చే డబ్బులకు సూచించిన పరిధిని నిర్ణయించాలని, దీనిపై ప్రభుత్వం జవాబు ఇవ్వాలని ఆదేశించి విచారణను వాయిదా వేశారు.

పాలారు నదీ తీరంలో
పురావస్తు పరిశోధనలు

మామల్లపురం, న్యూస్‌టుడే: పాలారు నది బేసిన్ గురించి మరిన్ని వివరాలు తెలుసుకోవడానికి సర్వే నిర్వహించాలని చెంగల్పట్టు జిల్లా కలెక్టర్ వీరప్పన్ పురావస్తుశాఖ అధికారులకు ఉత్తర్వులు జారీ చేశారు. ఆ మేరకు జిల్లా పురావస్తు శాఖ అధికారిణి సుభాషిణి శనివారం పాఠశాల విద్యార్థులతో కలిసి పాండూర్ తదితర ప్రాంతాల్లోని పాలారు నది తీరంలో పురావస్తు అధ్యయనాలు చేపట్టారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. తిరువణ్ణామలై జిల్లా చెయ్యూర్‌లోని ప్రభుత్వ ఆర్ట్స్ కళాశాల చరిత్ర విభాగ అధ్యాపకుడైన మదురై వీరన్ చెంగల్పట్టు జిల్లా గుండా వెళ్లే పాలారు బేసిన్‌లో ఒక ఉపరితల క్షేత్ర అధ్యయనాన్ని నిర్వహిస్తున్నారని తెలిపారు. ఇందులో చోళ, పల్లవ రాజుల కాలానికి చెందిన నాణేలు, ప్రాచీన ఆభరణాలు, మట్టి పాత్రలు, కొత్త రాతియుగం నాటి పనిముట్లు లభించాయని తెలిపారు. అదేవిధంగా చెంగల్పట్టు జిల్లా తిరుక్కళికుండ్రం సమీప పాండూర్ ప్రభుత్వ పాఠశాల విద్యార్థులు, చరిత్ర ఉపాధ్యాయుడు వడివేల్ సాయంతో ఇటీవల వారు చోళుల కాలం నాటి ఒక మట్టికుండను కనుగొన్నారని చెప్పారు. ఆ మేరకు తాము శనివారం పాండూర్ ప్రాంతంలో పురావస్తు పరిశోధనలు నిర్వహించామని తెలిపారు. పాలారు నది పరీవాహక ప్రాంతం తవ్వకాలకు అనుకూలం కాదని, చుట్టుపక్కల ప్రాంతాల్లో నిర్మాణాలకు గుంతలు తవ్వే సమయంలో, ఇతర పనులు చేపట్టే సమయంలో పురాతన వస్తువులు లభిస్తే వాటిని పరిశీలించి చెంగల్పట్టు పరిసరాల్లో తవ్వకాలు జరుపుతామని పేర్కొన్నారు.

పలు ఎక్స్‌ప్రెస్ రైళ్లకు
ఎల్‌హెచ్‌బీ బోగీలు

వడపళని, న్యూస్‌టుడే: పలు ఎక్స్‌ప్రెస్ రైళ్లకు ఎల్‌హెచ్‌బీ బోగీలు తగిలిస్తున్నట్లు దక్షిణ రైల్వే ప్రకటనలో పేర్కొంది.

■ **22661/22662** చెన్నై ఎగ్మోర్-రామేశ్వరం-చెన్నై ఎగ్మోర్ సేతు సూపర్‌ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్ ఎగ్మోర్‌లో అక్టోబరు 22, రామేశ్వరంలో అక్టోబరు 19 నుంచి నడిచే రైలు ఎల్‌హెచ్‌బీ బోగీలతో నడుస్తుంది. ■ **20605/20606** ఎగ్మోర్-తిరుచెందూర్-ఎగ్మోర్ చెందూర్ సూపర్‌ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్ ఎగ్మోర్ అక్టోబరు 20, తిరుచెందూర్‌లో అక్టోబరు 21వ తేదీ నుంచి నడిచే రైలుకు ఎల్‌హెచ్‌బీ బోగీలు తగిలిస్తారు.

■ **ఆలస్యం...** చెన్నై డివిజన్‌లోని పెదపారియ, నాయుడుపేట స్టేషన్ల మధ్య 237 వంతెన వద్ద కాంక్రీటు గిర్డర్ ఏర్పాటు చేస్తున్న కారణంగా ఈ కింది రైలు ఆలస్యంగా నడుస్తుంది. ■ **12840** చెన్నై సెంట్రల్-హౌవ్‌డా మెయిల్ ఆగస్టు 31న, సెప్టెంబరు 3, 10 తేదీల్లో 19.00కు బయలుదేరాల్సిన రైలు గంట ఆలస్యంగా 20.00కు బయలుదేరుతుంది. ■ **12840** చెన్నై సెంట్రల్-హౌవ్‌డా సెప్టెంబరు 5, 12 తేదీలు 19.00కు బయలుదేరాల్సిన రైలు రెండు గంటలు ఆలస్యంగా 21.00కు బయలుదేరుతుంది.

రేపు విద్యుత్తు వినియోగదారుల సమావేశం

వడపళని, న్యూస్‌టుడే: తమిళనాడు విద్యుత్తు పంపిణీ సంస్థ (టీఎన్‌పీడీసీఎల్) మంగళవారం నాలుగు డివిజన్లలో వినియోగదారులతో సమావేశాన్ని ఏర్పాటు చేసింది. మైలాపూర్, అంబత్తూర్, తండియార్‌పేట, కేకే నగర్ డివిజన్లలో ఉదయం 11 గంటలకు జరిగే సమావేశంలో విద్యుత్తు సరఫరా, ఇతర అంశాలపై చర్చించుకోవచ్చని అధికారులు ప్రకటనలో పేర్కొన్నారు. వళ్లువర్‌కోట్టం 110కేవీ సబ్ స్టేషనలో మైలాపూర్ డివిజన్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ (ఆపరేషన్ అండ్ నిర్వహణ), అంబత్తూర్ ఇండస్ట్రియల్ ఎస్టేట్ మూడో మెయిన్ రోడ్డులోని ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ (ఆపరేషన్ అండ్ నిర్వహణ), నంబరు 805, టీహెచ్ రోడ్డులోని ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ (ఆపరేషన్ అండ్ నిర్వహణ), తండియార్‌పేట కేకే నగర్ అన్నా మెయిన్‌రోడ్డులోని 110 కేవీ కేకే నగర్ సబ్‌స్టేషనులోని ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ కార్యాలయంలో సమావేశాలు జరగనున్నాయి.

హెడ్ కానిస్టేబుల్ కుటుంబానికి
ఆర్థిక సాయం

కాంచీపురం, న్యూస్‌టుడే: చెన్నై క్రోంపేట ట్రాఫిక్ ఇన్వెస్టిగేషన్ యూనిట్‌లో హెడ్ కానిస్టేబుల్‌గా పనిచేస్తున్న ఆర్.రాజా(37) గతేడాది సెప్టెంబర్ 9న అనారోగ్యంతో మరణించారు. ఆయన కుటుంబాన్ని ఆదుకునేలా 2011 బ్యాచ్‌లో కానిస్టేబుళ్లుగా ఎంపికైన వారు 'గార్డ్స్ హెల్పింగ్ హ్యాండ్స్' పేరిట ఓ గ్రూప్ ఏర్పాటు చేశారు. దాని ద్వారా రూ.26.15 లక్షలు సేకరించారు. ఆ మొత్తాన్ని రాజా భార్య, ఇద్దరు పిల్లలు, ఆయన తల్లి పేరిట తపాలా పొదుపు పథకంలో ఫిక్స్‌డ్ డిపాజిట్ ఫండ్‌గా పెట్టుబడి పెట్టారు.

సెప్టెంబరులోగా పనులు పూర్తి చేయాలి

గిండి, న్యూస్‌టుడే: వర్షాకాల ముందస్తు జాగ్రత్త చర్యలపై శనివారం చెన్నై మహానగర పాలక సంస్థ(జీసీసీ) ప్రధాన కార్యాలయమైన రిప్పన్ బిల్డింగ్‌లో సమావేశం జరిగింది. మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్, నీటి సరఫరాల శాఖ కార్యదర్శి గగన్‌దీప్ సింగ్ బేడి అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా నగరంలో జరుగుతున్న వర్షాకాల ముందస్తు జాగ్రత్త పనులను సెప్టెంబరులోగా పూర్తి చేయాలని ఆయన అధికారులను ఆదేశించారు. 215 పునరావాస కేంద్రాలు, 111 వంటశాలలను పరిశీలించి వసతులు మెరుగుపరచి సిద్ధంగా ఉంచాలని సూచించారు. సమావేశంలో చెన్నై మెట్రో రైల్ లిమిటెడ్ ఎండీ ఆశిష్ చటర్జీ, జీసీసీ కమిషనర్ జీఎస్ సమీరన్, పలు శాఖల అధికారులు పాల్గొన్నారు.

వీహెచ్‌పీ సీనియర్ నేత
వేదాంతం కన్నుమూత



సైదాపేట, న్యూస్‌టుడే: విశ్వ హిందూ పరిషత్ సీనియర్ నేత ఎస్.వేదాంతం(93) శనివారం కన్నుమూశారు. కేరళం రాష్ట్రం కొల్లంలో 1933లో సంపన్న కుటుంబంలో జన్మించిన ఆయన 16ఏళ్ల ప్రాయంలో ఆర్ఎస్ఎస్‌లో చేరారు. చదువు ముగిసిన తర్వాత ప్రముఖ ప్రైవేటు కంపెనీలో పని చేసిన వేదాంతం 1950లో తిరునెల్వేలి జిల్లా ఆర్ఎస్ఎస్ కార్యదర్శిగా ఎంపికయ్యారు. ఆర్ఎస్ఎస్‌లో పలు ఉన్నత బాధ్యతలు నిర్వర్తించారు. ఈ నేపథ్యంలో వయోధిక ఆరోగ్య సమస్యలతో శనివారం చెన్నైలో కన్నుమూశారు. ఆయన మృతికి కేంద్ర సహాయ మంత్రి ఎల్.మురుగన్, పలువురు ప్రముఖులు సంతాపం తెలిపారు.

స్థల మోసం కేసు
ఏసీపీతో మాట్లాడిన నటి గౌతమి

ప్యారిస్, న్యూస్‌టుడే: స్థల మోసం కేసు వ్యవహారమై చెన్నై పోలీసు అసిస్టెంట్ కమిషనరుని సినీనటి గౌతమి కలిశారు. శ్రీపెరంబుదూర్‌లో నటి గౌతమి పేరిట ఉన్న రూ.25 కోట్ల విలువైన స్థలాన్ని రూ.6 కోట్లకు విక్రయించి మోసానికి పాల్పడిన అళగప్పన్, అతని కుటుంబీకులు అరెస్టయ్యారు. ఈ నేపథ్యంలో ఈ కేసు దర్యాప్తు వ్యవహారమై నటి గౌతమి శనివారం చెన్నై పోలీసు కమిషనరు కార్యాలయంలో సెంట్రల్ క్రైమ్ బ్రాంచ్ అసిస్టెంట్ కమిషనరుని కలిసి మాట్లాడారు.

నిరుపేదలకు అన్నదానం

రెడ్‌హిల్స్, న్యూస్‌టుడే: తిరువళ్లూర్ జిల్లా రెడ్‌హిల్స్‌లోని ఇస్లాం సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో నిరుపేదలకు అన్నదాన కార్యక్రమం ఆదివారం నిర్వహించారు. సంఘ అధ్యక్షుడు రషీద్ అధ్యక్షత వహించారు. 1501 మందికి అన్నదానం చేశారు. సంఘ కోశాధికారి సమీం బాషా, ప్రతినిధులు ముహద్దీన్‌బాషా, బాబు, మౌలానా ఖాజామొహిద్దీన్ తదితరులు పాల్గొన్నారు.


భోజనం వడ్డిస్తున్న రషీద్ తదితరులు

టెక్సాస్ టైగర్ తొలి సింగిల్ విడుదల



పాటలోని ఓ సన్నివేశ దృశ్యం


చెన్నై, న్యూస్‌టుడే: సెల్వకుమార్ తిరుమారన్ కథ రాసి దర్శకత్వం వహించిన చిత్రం 'టెక్సాస్ టైగర్'. యూకే స్క్వాడ్ పతాకంపై బాలాజీ కుమార్, పార్తిబన్ కుమార్, సెల్వకుమార్ తిరుమారన్, సుజిత్ సంయుక్తంగా నిర్మించిన ఈ చిత్రంలో హ్రిదు హారూన్, సంయుక్త విశ్వనాథన్, రోహిణి, ఆంథోని దాసన్, రమేశ్ తిలక్, పార్తిబన్, సంయుక్త షణ్ముగనాథన్ తదితరులు ముఖ్య తారాగణం. చిత్రం తొలి సింగిల్ 'టైగరియన్ రోర్'ను చిత్రబృందం విడుదల చేసింది. ఈ పాటను ఎ.పా.రాజాతో కలిసి కెలిత్తి, తమిళ్ ఆదవన్ రాయడంతో పాటు కలిసి పాడారు. ఓషో వెంకట్ సంగీతం అందించారు.

బెత్లగేమ్ కుటుంబ యూనిట్ తమిళ ట్రైలర్...



చెన్నై: గిరిశ్ ఎ.డి దర్శకత్వంలో నివిన్ పౌలి, మమితా బైజు ప్రధానపాత్రల్లో నటించిన మలయాళ చిత్రం 'బెత్లెహేమ్ కుడుంబ యూనిట్'. భావన స్టూడియోస్ పతాకంపై ఫహద్ ఫాజిల్, దిలీశ్ పోతన్, శ్యామ్ పుష్కరన్ చిత్రాన్ని నిర్మించారు. విష్ణు విజయ్ సంగీతం అందించారు. ఓనం పర్వదినం సందర్భంగా ఈ చిత్రం విడుదలై ప్రేక్షకుల ఆదరాభిమానాలను పొందుతోంది. ఈ చిత్రాన్ని సెప్టెంబరు 4న తమిళంలోనూ విడుదల చేయనున్నట్లు చిత్రబృందం అధికారికంగా ప్రకటించింది. ఈ నేపథ్యంలో తమిళ ట్రైలర్‌ను విడుదల చేసింది. ప్రేమ, హాస్యం కలబోతతో రూపొందిన చిత్రం తమిళ ప్రేక్షకులనూ కచ్చితంగా రంజింపచేస్తుందని చిత్రబృందం ఆశాభావం వ్యక్తం చేసింది.

దోరతి రెండో సింగిల్...



చెన్నై: కార్తిక్ సుబ్బురాజ్ దర్శకత్వంలో కీర్తి సురేశ్, సనాంత్, రిషికాంత్ ప్రధానపాత్రల్లో నటించిన చిత్రం 'దోరతి'. చిత్రాన్ని దమ్మం ఫిలిమ్స్ పతాకం తరఫున కార్తిక్ సుబ్బురాజ్, సిక్య ఎంటర్‌టైన్‌మెంట్ పతాకంపై గునీత్ మోంగా, జియో స్టూడియోస్ పతాకంపై జ్యోతి దేశ్‌పాండే సంయుక్తంగా నిర్మించారు. చిత్రం రెండో సింగిల్ 'ముత్తుమణి'ని చిత్రబృందం విడుదల చేసింది. ఈ పాటను ఇళయరాజా రాయడంతో పాటు ప్రముఖ నేపథ్యగాయని శ్వేతా మోహన్‌తో కలిసి పాడారు. మ్యూజిక్ వీడియోగా విడుదలైన తొలి సింగిల్‌కు భరత్ మురళీధరన్ దర్శకత్వం వహించారు. ఈ చిత్రం టోరంటో అంతర్జాతీయ చిత్రోత్సవాల్లో ప్రదర్శనకు ఎంపిక కావడం గమనార్హం. సెప్టెంబరు 25న చిత్రం థియేటర్లలోకి రానుంది.

చెన్నై: సినిమాటూర్ ఎంటర్‌టైన్‌మెంట్ పతాకంపై సూర్యదేవి, శరత్ బాబు సంయుక్తంగా తమ తొలి చిత్రాన్ని నిర్మిస్తున్నారు. ఇంకా టైటిల్ ఖరారుకాని చిత్రానికి 'ప్రొడక్షన్ నం:1'గా నామకరణం చేశారు. ఈ చిత్రం ద్వారా నిర్మాత సూర్యదేవి నాయికగా పరిచయమవుతున్నారు. 'అప్పుచ్చి గ్రామం'లో నటించిన ప్రవీణ్ కథానాయకుడు. జయప్రకాశ్, వినోదిని, కుమరవేల్, లింగా, 'కల్లూరి' వినోద్, బావా చెల్లదురై తదితరులు ఇతర నటీనటులు. ప్రస్తుతం చిత్రీకరణ పూర్తయినట్లు చిత్రబృందం ప్రకటించింది. ఈ సందర్భంగా సంబరాలు చేసుకున్న ఫొటోలను సామాజిక మాధ్యమాల్లో పంచుకుంది. త్వరలో టైటిల్‌ను ప్రకటించనున్నట్లు వెల్లడించింది.

సూర్యదేవి సినిమా చిత్రీకరణ పూర్తి



వేడుకల్లో చిత్రబృందం

ఘనంగా శక్తివేలన్ జన్మదిన వేడుకలు

చెన్నై, న్యూస్‌టుడే: శక్తి ఫిల్మ్ ఫ్యాక్టరీ వ్యవస్థాపకుడు శక్తివేలన్ పుట్టినరోజు వేడుకలు ఘనంగా జరిగాయి. చెన్నై నగరంలో జరిగిన వేడుకలకు తమిళ చిత్ర పరిశ్రమకు చెందిన ప్రముఖ నటీనటులు, దర్శకులు, నిర్మాతలు, పంపిణీదారులు, థియేటర్ల యజమానులు హాజరై శక్తివేలన్‌కు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. నటులు సూర్య, కార్తి, విక్రమ్, ప్రభు, గౌతమ్ రామ్ కార్తిక్, పార్తిబన్, సుందర్ సి., మాదంపట్టి రంగరాజ్, శాంతను, గుణనిధి, ఏగన్, సునీల్ రెడ్డి తదితరులు హాజరయ్యారు. దర్శకులు 'పసంగ' పాండియరాజ్, అధిక్ రవిచంద్రన్, వెంకట్ ప్రభు, కార్తిక్ సుబ్బురాజ్, రామ్, 'ఉరియడి' విజయకుమార్, త్యాగరాజన్, కుమారరాజా, నటీమణులు సాక్షి అగర్వాల్, అతుల్య రవి, నిర్మాతలు ఏఎం రత్నం, జ్ఞానవేల్ రాజా, రాజాశేఖర్ పాండియన్, కన్నన్ రవి, అమ్మ క్రియేషన్స్ శివ, ధనంజయన్, అరుణ్ విశ్వ, అరుణ్‌కుమార్, ఇతర సినీ పరిశ్రమ ప్రముఖులు కూడా హాజరై శక్తివేలన్‌కి పుట్టినరోజు శుభాకాంక్షలు తెలిపారు.



శక్తివేలన్‌కు శుభాకాంక్షలు తెలిపిన నటులు సూర్య, కార్తి, గౌతమ్ రామ్ కార్తిక్

ఎం.ఎస్.కృష్ణన్‌కు నడిగర్ సంఘం నివాళి



ఎం.ఎస్.కృష్ణన్ చిత్రపటానికి నివాళులర్పించిన సభ్యులు

చెన్నై: దక్షిణ భారత నటుల సంఘం అగ్రగణ్యుడు ఎం.ఎస్. కృష్ణన్ 69వ వర్ధంతిని ఆ సంఘం నిర్వహించింది. దక్షిణ భారత నడిగర్ సంఘం కార్యాలయ ప్రాంగణంలో ఆదివారం ఏర్పాటు చేసిన ఆయన చిత్రపటానికి సంఘ అధ్యక్షుడు ఎం.నాజర్, కార్యవర్గ సభ్యుడు హేమచంద్రన్, నామినేటెడ్ కార్యవర్గ సభ్యులు సౌందరరాజా, దాశరథి, కె.కె. శరవణన్, సంఘం మేనేజర్ తామరాజ్ తదితరులు పుష్పాంజలి ఘటించారు.

బరువు తగ్గిన మంజిమా మోహన్



చెన్నై: తమిళంలో పలు విజయవంతమైన చిత్రాల్లో నటించిన మలయాళ కుట్టి మంజిమా మోహన్ నటుడు గౌతమ్ రామ్ కార్తిక్‌ను వివాహం చేసుకున్న తర్వాత సినిమాలకు దూరమయ్యారు. మళ్లీ వెండితెరపై అలరించడానికి ఆమె సిద్ధమవుతున్నారు. పెళ్లి తర్వాత శరీర బరువు పెరగడంతో తగ్గించడానికి కసరత్తులు చేశారు. అనుకున్నట్టే శరీర బరువును తగ్గించి సరికొత్త లుక్‌కు మారారు. ఇందుకు సంబంధించిన ఫొటోలను సామాజిక మాధ్యమాల్లో పంచుకుని మళ్లీ నటించడానికి సై అంటూ సంకేతాలు పంపారు. ఈ ఫొటోలు సామాజిక మాధ్యమాల్లో వైరలవుతున్నాయి.

కొల్లిమలైలో ఆధునిక క్యాంటీన్ త్వరలో ప్రారంభం



కొత్తగా నిర్మించిన వసతిగృహాలు

విల్లివాక్కం, న్యూస్‌టుడే: నామక్కల్ జిల్లాలోని ప్రముఖ పర్యాటక కేంద్రమైన కొల్లిమలైలో ఆధునిక వసతులతో కూడిన ప్రత్యేక వసతిగృహాలతో కూడిన తమిళనాడు ఉణవగంను రూ.4.22 కోట్లతో నిర్మించారు. దీనిని అక్టోబరులో ముఖ్యమంత్రి విజయ్ వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ప్రారంభించనున్నట్లు సమాచారం. ఇక్కడి జలపాతాలు, బొటానికల్ పార్కు, పడవల రేవు, చిక్కుపారై వ్యూ పాయింట్ తిలకించడానికి, ఆహ్లాదకరమైన వాతావరణాన్ని ఆస్వాదించడానికి ఏప్రిల్, మే నెలల్లో పర్యాటకులు అధిక సంఖ్యలో వస్తుంటారు. అయితే ఇక్కడ క్యాంటీన్ లేకపోవడంతో పర్యాటకులు అసంతృప్తితో ఉన్నారు. 2025లో తమిళనాడు పర్యాటకాభివృద్ధి సంస్థ 'అముదగం' పేరుతో క్యాంటీన్‌తో కూడిన వసతి గృహాలు నిర్మించడానికి చర్యలు చేపట్టింది. వాసలూర్‌పట్టి బొటానికల్ పార్కు సమీపంలో 13 ఎకరాల విస్తీర్ణంలో తమిళనాడు ఉణవగం, వసతిగృహాల నిర్మాణ పనులు ప్రారంభమయ్యాయి. ఆధునిక సౌకర్యాలతో 15 ప్రత్యేక వసతి గృహాలు నిర్మించారు. అంతేకాకుండా 30 మంది కూర్చొని ఆహారం తినే విధంగా అముదగం పేరుతో తమిళనాడు క్యాంటీన్ నిర్మించారు. పనులు పూర్తయిన నేపథ్యంలో అక్టోబరులో ప్రారంభం కానుంది.

4 వరుసల రోడ్డు నిర్మాణ పనులు 80శాతం పూర్తి



మైలాపూర్ వద్ద జరుగుతున్న పనులు

ఊత్తుకోట, న్యూస్‌టుడే: తిరువళ్లూర్ నుంచి ఊత్తుకోట వరకు 24 కిలోమీటర్ల దూరానికి ఉన్న రోడ్డును వాహనాల రద్దీకి అనుగుణంగా 4 వరుసలకు విస్తరిస్తున్నారు. ఈ పనులు ఏడాది క్రితం ప్రారంభమయ్యాయి. ప్రాజెక్టులో భాగంగా తొలుత ఊత్తుకోట నుంచి పెరింజేరి వరకు 2.6 కిలోమీటర్ల దూరానికి రూ.20 కోట్ల వ్యయంతో పనులు పూర్తయ్యాయి. మలి దశగా తిరువళ్లూర్ నుంచి పూండి సమీపం మైలాపూర్ వరకు 15.5 కిలోమీటర్ల దూరానికి రూ.88 కోట్ల వ్యయంతో వేగంగా జరగుతున్నాయి. ఇప్పటివరకు 80శాతం పనులు పూర్తి చేశామని, మిగిలిన పనులను వచ్చే ఏడాది ఏప్రిల్‌నాటికి పూర్తి చేసేందుకు నిర్ణయించినట్లు రహదారుల శాఖాధికారులు తెలిపారు.

విద్యుత్తు కోతలకు నిరసనగా ఆందోళన

పెరియపాళ్యం, న్యూస్‌టుడే: తిరువళ్లూర్ జిల్లా పెరియపాళ్యం సమీపం ఆరణిలో 15 రోజులుగా అప్రకటిత విద్యుత్తు కోతలు విధిస్తున్నారు. దీంతో పట్టణవాసులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఈ నేపథ్యంలో విద్యుత్తు కోతలకు నిరసనగా వీసీకే తరఫున ఆదివారం ఆందోళనకు దిగారు. తాలూకా కార్యదర్శి రావణన్ అధ్యక్షత వహించారు.

వీవోసీ పార్కుకి తాత్కాలిక ప్రహరీ నిర్మాణం

విల్లివాక్కం, న్యూస్‌టుడే: ఈరోడ్‌లోని వీవోసీ పార్కు వెనుక భాగంలో 50 అడుగుల మేర ప్రహరీ లేని కారణంగా కొందరు నేరాలకు పాల్పడి పార్కులో తలదాచుకుంటున్నారు. అదేవిధంగా రాత్రి సమయాలలో ద్విచక్ర వాహనాలపై వెళ్తున్న వారిని కత్తితో బెదిరించి దోపిడీలకు పాల్పడుతున్నారు. ఈ క్రమంలో గత జులై నెలాఖరులో జరిగిన నగరపాలక సంస్థ జోనల్ కమిటీ సమావేశంలో మొదటి జోన్ ఛైర్మన్ పళనిసామి (డీఎంకే) పార్కులో కూలిపోయిన 50 అడుగుల ప్రహరీని నిర్మించాలని కోరారు. నిధులు లేకుంటే కనీసం తాత్కాలిక ప్రహరీ ఏర్పాటు చేయాలని కోరారు. సోమవారం నగరపాలక సంస్థ సమావేశం జరుగనున్న నేపథ్యంలో రేకులతో తాత్కాలిక ప్రహరీ నిర్మించారు.

ఆటోను ఢీకొన్న గుర్తు తెలియని వాహనం

తల్లీకుమార్తె, బాలుడి దుర్మరణం

పెరియపాళ్యం, న్యూస్‌టుడే: ఆటోను గుర్తు తెలియని వాహనం ఢీకొన్న ప్రమాదంలో తల్లీకుమార్తె, 10ఏళ్ల బాలుడు మృతిచెందారు. పోలీసుల కథనం మేరకు.. చెన్నై కొడుంగయూరు త్యాగరాజర్ నగర్‌కు చెందిన లోకనాథన్ ఆటో డ్రైవర్. ఆయనకు భార్య పూంగొడి(39), కుమార్తె ధనలక్ష్మి ఉన్నారు. ముగ్గురు ఆటోలో తిరువళ్లూర్ జిల్లా పెరియపాళ్యంలోని భవాని అమ్మవారి ఆలయానికి శనివారం సాయంత్రం బయలుదేరారు. మార్గమధ్యంలో పూంగొడి తల్లి రాధ(65), ఆమె అన్న కుమారులు గోకుల్(10), ప్రశాంత్ కూడా ఆటో ఎక్కారు. పెరియపాళ్యం సమీపం పనపాక్కం వద్ద వెళ్తుండగా గుర్తు తెలియని వాహనం ఢీకొని ఆగకుండా వెళ్లిపోయింది. ప్రమాదంలో ఆటో నుజ్జునుజ్జయింది. పూంగొడి, రాధ, గోకుల్ అక్కడికక్కడే మృతి చెందారు. తీవ్రంగా గాయపడిన లోకనాథన్, ధనలక్ష్మి, ప్రశాంత్‌ను స్థానికులు తిరువళ్లూర్ ప్రభుత్వాస్పత్రికి తరలించారు. పెరియపాళ్యం పోలీసులు మృతదేహాలను పోస్టుమార్టానికి తరలించి కేసు దర్యాప్తు చేస్తున్నారు.

వ్యాను ఢీకొని నలుగురు చిన్నారులు...

సైదాపేట: దిండుక్కల్ జిల్లా వడమదురై వద్ద వ్యాను ఢీకొని నలుగురు చిన్నారులు మృతి చెందారు. పోలీసుల కథనం ప్రకారం... కొల్లపట్టి ప్రాంతానికి చెందిన అంజమ్మాళ్(60) ఆదివారం కనవాయ్‌మేడు ప్రాంతంలో మేకలు మేపింది. ఆ సమయంలో ఆమె తన మనవళ్లు, మనవరాళ్లు ఆరు మందితో కలిసి రోడ్డు పక్కన కూర్చుంది. అప్పుడు అటుగా వచ్చిన ఓ వ్యాను అదుపుతప్పి రోడ్డు పక్కన ఉన్నవారిని ఢీకొట్టింది. ఇద్దరు పిల్లలు లేచి పక్కకు వెళ్లి తప్పించుకున్నారు. యోగవర్ధిని(11), అనన్య(6), తనుశ్రీ(5), మోసికరన్(6) అక్కడికక్కడే మృతి చెందారు. అంజమ్మాళ్ తీవ్రంగా గాయపడింది. సమాచారం మేరకు వడమదురై పోలీసులు ఘటనా స్థలికి చేరుకుని మృతదేహాలను శవపరీక్షకు తరలించారు. అంజలమ్మాళ్ ప్రాణాపాయ స్థితిలో చికిత్స పొందుతోంది. ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

విద్యుదాఘాతంతో ఎలక్ట్రీషియన్...



మృతదేహాన్ని కిందకు దించుతున్న దృశ్యం

టీనగర్: సేలం జిల్లా మెట్టూర్ సమీపంలోని కాళియూర్ గ్రామానికి చెందిన ముత్తుమాణిక్కం(55) ఎలక్ట్రీషియన్. ఇదిలా ఉండగా విద్యుత్ శాఖ సిబ్బంది అతణ్ని పిలిపించి మరమ్మతుకు గురైన ట్రాన్స్‌ఫార్మర్‌ను బాగు చేయాలని చెప్పారు. ఆ మేరకు ముత్తుమాణిక్కం పని చేస్తుండగా ఉన్నట్టుండి విద్యుత్ ప్రసారమవడంతో విద్యుదాఘాతానికి గురై అక్కడికక్కడే మరణించాడు. ఘటనపై నంగవల్లి పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

ఆలయంలో స్పృహకోల్పోయి వృద్ధురాలు...

వేలూర్: వేలూర్ జిల్లా పళ్లికొండ సమీపంలోని వెట్టువాణం ఎల్లైయమ్మన్ ఆలయానికి ఆదివారం 200 మందికి పైగా భక్తులు వచ్చారు. అదే ప్రాంతానికి చెందిన మేఘల(65) ఆలయంలో అమ్మవారిని దర్శించుకుని అకస్మాత్తుగా కుప్పకూలింది. వెంటనే అక్కడున్న వైద్య బృందం ప్రథమ చికిత్స అందించింది. తర్వాత అంబులెన్స్ సిబ్బంది అక్కడికి చేరుకుని పరీక్షించి మృతి చెందినట్లు తెలిపారు. పళ్లికొండ పోలీసులు మృతదేహాన్ని స్వాధీనం చేసుకుని పోస్టుమార్టానికి తరలించారు. కేసు దర్యాప్తులో ఉంది.

మహిళ హత్య కేసులో ప్రియుడి అరెస్టు



భారతిరాజా

ఊత్తుకోట, న్యూస్‌టుడే: ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం చిత్తూరు జిల్లా నింద్ర మండలం సవరంబాక్కం గ్రామానికి చెందిన అరుణ(45) తిరువళ్లూర్ జిల్లా ఊత్తుకోట సమీపం దొడ్డారెడ్డికుప్పంలో గురువారం రాత్రి హత్యకు గురయ్యారు. మృతదేహాన్ని పోలీసులు శుక్రవారం స్వాధీనం చేసుకుని పోస్టుమార్టానికి తిరువళ్లూర్ ప్రభుత్వాస్పత్రికి తరలించి దర్యాప్తు చేపట్టారు. అరుణ భర్త మంజునాథ నాయుడు కొన్నేళ్ల క్రితం మృతి చెందారు. వీరి కుమారుడు, కుమార్తె బెంగళూరులో సాఫ్ట్‌వేర్ ఇంజినీర్లుగా పనిచేస్తున్నారు. అరుణ తల్లిదండ్రులు పెరియపాళ్యం సమీపం వడట్టూరులో ఉంటున్నారు. దీంతో ఆమె అక్కడకు వెళ్లి వస్తుంటుంది. ఇలా వచ్చి వెళ్లే క్రమంలో అదే గ్రామానికి చెందిన వ్యవసాయ కూలీ భారతిరాజాతో పరిచయం ఏర్పడి వివాహేతర సంబంధానికి దారితీసింది. రహస్య ప్రాంతంలో ఇద్దరూ తరచూ కలిసే వారు. ఈ నేపథ్యంలో గురువారం రాత్రి వడట్టూరులో జరిగిన వివాహ వేడుకలో అరుణ పాల్గొంది. అనంతరం భారతిరాజాతో ద్విచక్ర వాహనంపై దొడ్డారెడ్డికుప్పానికి చేరుకుంది. ఏకాంతంగా గడుపుదామని అరుణ బలవంతం చేయగా భారతిరాజా నిరాకరించాడు. ఇద్దరి మధ్య వాగ్వాదం జరిగింది. ఆగ్రహించిన భారతిరాజా వెంట తీసుకొచ్చిన మోటారు ఆయిల్‌ను ఆమెపై పోసి నిప్పంటించి పారిపోయాడు. అరుణ మృతదేహం పక్కన సెల్‌ఫోన్ లభ్యమైంది. దీని ఆధారంగా భారతిరాజాను పోలీసులు శనివారం రాత్రి పెరియపాళ్యం సమీపం పాలేశ్వరంలో అరెస్టు చేశారు. హత్య చేసినట్లు అతను అంగీకరించాడు. అనంతరం కోర్టులో హాజరుపరచి పుళల్ కేంద్ర కారాగారానికి తరలించారు.

అత్తను హత్య చేసిన అల్లుడు...

ప్యారిస్: విరుదునగర్ జిల్లా పాలైయంపట్టికి చెందిన శివ ప్రైవేటు వస్త్ర తయారీ సంస్థలో పనిచేస్తున్నాడు. ఇతను అక్కడే పనిచేస్తున్న వాసగదేవి అనే యువతిని ప్రేమించి, ఆరు నెలల క్రితం వివాహం చేసుకున్నాడు. ఇదిలా ఉండగా మద్యానికి బానిసైన శివ ప్రతిరోజు భార్యతో గొడవపడేవాడు. దీంతో వాసగదేవి పుట్టింటికి వెళ్లిపోయింది. అదేవిధంగా విడాకులు కోరుతూ కోర్టులో కేసు వేసింది. ఈ నేపథ్యంలో శనివారం అత్తివారింటికి వెళ్లిన శివ భార్యకు నచ్చజెప్పేందుకు యత్నించాడు. అప్పుడు వారి మధ్య గొడవ జరిగింది. భార్యను బలవంతంగా తీసుకెళ్లేందుకు యత్నించడంతో ఆమె తల్లి శాంతి(55), సోదరుడు సామిమురుగన్ అడ్డుకున్నారు. దీంతో శివ తన వద్ద కత్తితో అత్త, బావమరిదిపై దాడి చేశాడు. తీవ్రంగా గాయపడిన శాంతి ఘటనా స్థలిలోనే మృతిచెందింది. సామిమురుగన్ గాయపడ్డాడు. స్థానికులు అతణ్ని ఆస్పత్రికి తరలించారు. పోలీసులు ఘటనాస్థలికి చేరుకుని శివను అరెస్టు చేశారు.

గంజాయి తరలిస్తున్న ముగ్గురు...

రెడ్‌హిల్స్: తిరువళ్లూర్ సమీపం తిరుపాచ్చూరులో పోలీసులు ఆదివారం వాహనాల తనిఖీ చేపట్టారు. ద్విచక్ర వాహనంపై వచ్చిన ముగ్గురు వ్యక్తులను ఆపి వారి బ్యాగుల్లో సోదా చేశారు. 6 కిలోల గంజాయిని గుర్తించి స్వాధీనం చేసుకున్నారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం చిత్తూరు జిల్లా నగరికి చెందిన సతీష్, చంద్రన్, విఘ్నేష్ అనే వ్యక్తులను అరెస్టు చేశారు.

17ఏళ్ల బాలికను గర్భవతిని చేసిన చిన్నాన్న...

ప్యారిస్: రామనాథపురం జిల్లా తిరువాడానై తాలూకాలోని ఓ గ్రామానికి చెందిన 17ఏళ్ల బాలిక తన అమ్మమ్మ ఇంట్లో ఉంటూ ప్లస్‌టూ చదువుతోంది. బాలిక ఉంటున్న ఇంట్లో ఆమె పిన్ని కుటుంబం కూడా నివసిస్తోంది. ఈ క్రమంలో పిన్ని భర్త మహేంద్రన్ బాలికపై అత్యాచారానికి పాల్పడ్డాడు. ఈ నేపథ్యంలో అనారోగ్యానికి గురైన ఆమెను దేవకోట్టైలోని ప్రైవేటు ఆస్పత్రికి తీసుకెళ్లగా పరీక్షించిన వైద్యులు గర్భంతో ఉన్నట్లు తెలిపారు. సమాచారం మేరకు తిరువాడానై ఆల్ ఉమెన్ పోలీసులు కేసు నమోదు చేసుకుని మహేంద్రన్‌ను అరెస్టు చేశారు. ఈ నేపథ్యంలో అతనిపై గూండా చట్టం కింద చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టరు శివగురు ప్రభాకర్ ఆదేశించారు. ఆ మేరకు పోలీసులు ఆదివారం గూండా చట్టం కింద కేసు నమోదు చేశారు.

బాలికలతో వ్యభిచారం చేయిస్తున్న పారిశ్రామికవేత్త...

ప్యారిస్: బాలికలతో వ్యభిచారం చేయిస్తూ లైంగిక వాంఛ తీర్చుకుంటున్న పారిశ్రామికవేత్తని పోలీసులు అరెస్టు చేశారు. శనివారం పోలీసులు విడుదల చేసిన ప్రకటనలో... చెన్నైకి చెందిన ఓ సామాజిక కార్యకర్త గతేడాది అక్టోబరులో చెన్నై వ్యభిచార నియంత్రణ విభాగం ఇన్‌స్పెక్టరుని కలిసి ఓ ఫిర్యాదు చేశారు. గుర్తు తెలియని వ్యక్తి తన కార్యాలయానికి వచ్చి ఓ పెన్‌డ్రైవ్ ఇచ్చారని, అందులో ప్రముఖ పారిశ్రామికవేత్త వీరమణి ఓ బాలికతో లైంగిక కోరికలు తీర్చుకుంటున్న దృశ్యాలు ఉన్నాయని తెలిపారు. అనంతరం సెంట్రల్ క్రైమ్, వ్యభిచార నియంత్రణ విభాగం పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. వీరమణి తేనాంపేటలో ఓ ఇంటిని అద్దెకు తీసుకుని, దాని నిర్వహణ బాధ్యతలను శాంతి, ఆమె భర్త మహేంద్ర సింకన్‌లకు అప్పగించాడని, వారు ఆ ఇంటికి పలువురు బాలికలను తీసుకొచ్చి వ్యభిచారం చేయిస్తున్నట్లు తెలిసింది. అనంతరం శాంతి, మహేంద్ర సింకన్ ఇల్లు, కార్యాలయాల్లో తనిఖీలు చేశారు. మరి కొంతమంది బాలికలు, మహిళల ఫొటోలు, ముఖ్యమైన ఆధారాలు లభించాయి. అనంతరం శాంతి, మహేంద్ర సింకన్, వీరమణిలను అరెస్టు చేశారు. కేసు దర్యాప్తులో ఉంది.

శిశువును విక్రయించిన తల్లిదండ్రులు సహా నలుగురు...

ట్రిప్లికేన్: తిరుపత్తూర్ జిల్లా ఆంబూర్ మున్సిపాలిటీ తోప్పు బాషా నగర్‌కి చెందిన రహ్మతుల్లా, హవామా దంపతులు. వీరికి ఇద్దరు కుమారులు, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. ఇదిలా ఉండగా హవామా ఐదోసారి ఆగస్టు 14వ తేదీ ఆడబిడ్డకు జన్మనిచ్చింది. కుటుంబ పరిస్థితుల కారణంగా ఆగస్టు 23వ తేదీ బంధువుల సాయంతో శిశువును కర్ణాటక రాష్ట్రం బెంగళూర్‌కి చెందిన షమ్రిన్‌తాజ్ అనే మహిళకి రూ.లక్షకు విక్రయించింది. సమాచారం మేరకు తిరుపత్తూర్ జిల్లా బాలల సంరక్షణ కమిటీ అధికారి సుగప్రియ హవామా దంపతులపై ఆంబూర్ నగర పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. పోలీసులు దర్యాప్తు చేపట్టి బెంగళూర్‌లో ఉన్న శిశువును రక్షించారు. అనంతరం తల్లిదండ్రులు రహ్మతుల్లా, హవామా, షమ్రిన్ తాజ్, ఆమె భర్త అక్బర్ బాషాను అరెస్టు చేశారు. అనంతరం వారిని కోర్టులో హాజరుపరచి జైలుకు తరలించారు.

బాలికపై అత్యాచారానికి పాల్పడిన సవతి తండ్రికి జీవిత ఖైదు

విల్లివాక్కం, న్యూస్‌టుడే: బాలికపై అత్యాచారానికి పాల్పడిన సవతి తండ్రికి జీవిత ఖైదు శిక్ష పడింది. నీలగిరి జిల్లా దేవాలా ఎస్టేట్ ప్రాంతానికి చెందిన మహిళకు 13ఏళ్ల కుమార్తె ఉంది. భర్త నుంచి విడిపోయిన మహిళ రాజా అనే వ్యక్తిని రెండో వివాహం చేసుకుంది. ఇదిలా ఉండగా 2019 జూన్ 13వ తేదీ ఇంట్లో ఎవరూ లేని సమయంలో రాజా బాలికపై అత్యాచారానికి పాల్పడ్డాడు. 2020 మార్చిలో బాలిక అనారోగ్యానికి గురవడంతో ఆస్పత్రికి తీసుకెళ్లగా గర్భంతో ఉన్నట్లు తెలిసింది. తల్లి ఫిర్యాదు మేరకు దేవాలా మహిళా పోలీసులు దర్యాప్తు చేపట్టి రాజాను పోక్సో చట్టం కింద అరెస్ట్ చేశారు. ఈ కేసు విచారణ ఊటీ మహిళా ఫాస్ట్‌ట్రాక్ కోర్టులో శుక్రవారం ముగిసింది. నేరం రుజువు కావడంతో రాజాకు జీవిత ఖైదు శిక్ష విధిస్తూ న్యాయమూర్తి సెంథిల్‌కుమార్ ఉత్తర్వులు జారీ చేశారు. బాధితురాలికి రూ.5 లక్షల పరిహారం అందించాలని జిల్లా కలెక్టర్‌కి సిఫారసు చేశారు.

అనిశా ఇన్‌స్పెక్టరుకి ఏడాదిన్నర...

ప్యారిస్: పుదుక్కోట్టైకి చెందిన కార్తికేయన్, ఆయన భార్య తమిళ్‌సెల్వి 2021లో ద్విచక్ర వాహనంపై కారైక్కుడికి బయలుదేరారు. మరిచుకట్టు వంతెన వద్ద వెళ్తుండగా ఎదురుగా వచ్చిన కారు ఢీకొట్టింది. ప్రమాదంలో కార్తికేయన్, తమిళ్‌సెల్విలు గాయపడ్డారు. ఇందుకు సంబంధించి కారు నడిపిన అవినీతి నిరోధకశాఖ ఇన్‌స్పెక్టరు పీటర్‌పై చెట్టినాడు పోలీసులు కేసు నమోదు చేశారు. ఈ కేసు శనివారం విచారించిన కారైక్కుడి కోర్టు.. నేరం రుజువు కావడంతో పీటర్‌కి ఏడాదిన్నర జైలు శిక్ష, రూ.2,500 జరిమానా విధించింది.

థాయ్‌లాండ్ హోటల్‌లో పనిచేస్తున్న యువకుడి మృతి

యజమానులు చంపారని కుటుంబీకుల ఆరోపణ

ప్యారిస్: తూత్తుకుడి జిల్లా ఒట్టపిడారానికి చెందిన పొన్నమ్మాళ్ కుమారుడు ఈసక్(23) క్యాటరింగ్ కోర్సు పూర్తి చేసి చెన్నైలోని ఓ హోటల్‌లో పనిచేస్తున్నారు. ఈ క్రమంలో థాయ్ లాండ్‌కి చెందిన ఓ వ్యక్తి పరిచయమయ్యారు. తర్వాత ఆయన ఈసక్‌ని థాయ్‌లాండ్‌లోని తన హోటల్‌లో పనికి తీసుకెళ్లారు. గత మూడు నెలలుగా అతనికి వేతనం ఇవ్వలేదని తెలుస్తోంది. ఈ నెల 16వ తేదీ ఈసక్ హోటల్ నుంచి బయటకు వచ్చారు. తన అన్న ఇమ్మానువేల్‌కి ఫోన్‌చేసి తనను హోటల్‌లో హింసించారని, అందుకే పని మానేసి బయటకు వచ్చినట్లు చెప్పారు. అనంతరం ఆ రోజు మధ్యాహ్నం ఈసక్ ఫోన్ స్విచ్ ఆఫ్ అయింది. 24వ తేదీ అతను ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నట్లు హోటల్ యజమాని కుటుంబీకులకు ఫోన్ చేసి చెప్పాడు. 28వ తేదీ మళ్లీ ఫోన్ చేసి మృతిచెందినట్లు తెలిపారు. ఈ నేపథ్యంలో ఈసక్‌ని కొట్టి చంపారని, తమకు న్యాయం చేయాలని కుటుంబీకులు కోరుతున్నారు. అదేవిధంగా ఈసక్ మృతదేహాన్ని రాష్ట్రానికి తీసుకొచ్చేందుకు చర్యలు చేపడతామని మంత్రి మదన్‌రాజా హామీ ఇచ్చారు.

బావిలో ఇద్దరు బాలుర మృతదేహాలు లభ్యం

ట్రిప్లికేన్, న్యూస్‌టుడే: తిరుపత్తూర్ జిల్లా వాణియంబాడి సమీపం ఆలంగాయం పంచాయతీ పెత్తూర్‌లో సుగుణ ప్రకాశం అనే మహిళకి చెందిన వ్యవసాయ బావిలో ఇద్దరు బాలుర మృతదేహాలు ఉన్నట్లు ఆదివారం ఆలంగాయం పోలీసులకు సమాచారం అందింది. అక్కడకు చేరుకున్న పోలీసులు, అగ్నిమాపక సిబ్బంది కుళ్లిన స్థితిలో ఉన్న 9, 15ఏళ్ల వయసున్న బాలుర మృతదేహాలను బయటికి తీసి పోస్టుమార్టానికి తరలించారు. వారి వివరాలు తెలియలేదు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేపట్టారు.

తల్లి, కుమార్తెపై కత్తితో దాడి చేసిన వంట మాస్టర్

వృద్ధురాలి మృతి, యువతి పరిస్థితి విషమం

విల్లివాక్కం: ధర్మపురి జిల్లా పాపిరెడ్డిప్పట్టి సమీపంలోని అదికారపట్టి అమ్మన్ నగర్‌కి చెందిన సురేష్ వంట మాస్టర్. ఇతనికి భార్య షాలినీ, కుమార్తె చిన్మయి(19) ఉన్నారు. చిన్మయి ప్రైవేటు కళాశాలలో నర్సింగ్ డిప్లొమా చదువుతోంది. ఇదిలా ఉండగా అభిప్రాయభేదాలతో భార్యాభర్తలు విడిపోయారు. దీంతో చిన్మయి నానమ్మ ఉమారాణి వద్ద ఉంటోంది. పక్కనే మరో ఇంట్లో సురేష్ ఉంటున్నాడు. సేలంలోని ప్రైవేట్ ఆస్పత్రిలో పనిచేస్తున్న షాలినీ తరచూ ఊరికి వచ్చి కుమార్తెను చూసి వెళ్తుంటుంది. ఈ నేపథ్యంలో ఈ నెల 28వ తేదీ రాత్రి చిన్మయి తండ్రికి భోజనం తీసుకెళ్లింది. అప్పుడు ఫోన్‌లో ఎవరితో మాట్లాడుతున్నావని సురేష్ కుమార్తెను నిలదీశాడు. ఆమె ఎదురు తిరిగింది. మత్తులో ఉన్న సురేష్ ఆగ్రహంతో వేట కొడవలితో కుమార్తెపై దాడి చేశాడు. అడ్డుకోబోయిన ఉమారాణిపై కూడా దాడి చేయడంతో ఆమె అక్కడికక్కడే మృతి చెందింది. చుట్టుపక్కలవారు చిన్మయిని పాపిరెడ్డిప్పట్టి ప్రభుత్వ ఆస్పత్రికి తీసుకెళ్లారు. అక్కడి నుంచి మెరుగైన చికిత్స కోసం ధర్మపురి ప్రభుత్వ వైద్య కళాశాల ఆస్పత్రికి తరలించారు. సమాచారం మేరకు ఎ.పళ్లిప్పట్టి పోలీసులు ఘటనా స్థలికి చేరుకుని ఉమారాణి మృతదేహాన్ని శవపరీక్షకు తరలించి సురేష్‌ని అరెస్ట్ చేశారు.

ఇద్దరు కుమారులతో రైలు కిందపడి మహిళ ఆత్మహత్య



వల్లి (పాతచిత్రం)

ట్రిప్లికేన్, న్యూస్‌టుడే: అరక్కోణం వద్ద ఓ మహిళ తన ఇద్దరు కుమారులతో కలిసి రైలు కిందపడి ఆత్మహత్యకు పాల్పడింది. పోలీసుల కథనం మేరకు... రాణిపేట్టై జిల్లా అరక్కోణం సమీపం మంగమ్మాపేట్టైకి చెందిన కోట్టయ్య(30) కూలీ. అనారోగ్యంతో కొన్ని నెలల క్రితం మృతిచెందాడు. ఇతనికి భార్య వల్లి(23), కుమారులు భరత్(7), సంతోశ్(3) ఉన్నారు. ఇదిలా ఉండగా ఆదివారం ఉదయం వల్లి తన కుమారులతో కలిసి అరక్కోణం-తిరుపతి ఎక్స్‌ప్రెస్ రైలు కింద పడి ఆత్మహత్య చేసుకుంది. అరక్కోణం రైల్వే పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని ముగ్గురి మృతదేహాలను స్వాధీనం చేసుకున్నారు. తర్వాత పోస్టుమార్టానికి తరలించారు. ఆత్మహత్యకు కారణాలు తెలియలేదు. దర్యాప్తు జరుగుతోంది.

కుమారుడి మృతిని తట్టుకోలేక తల్లి...

వేళచ్చేరి: కడలూర్ జిల్లా కుల్లంచావడి సమీపం అనుకంపట్టు గ్రామానికి చెందిన ఆదిమూలం-రాజకుమారి దంపతుల కుమారుడు సంతోష్‌కుమార్(39). ఇతను స్థానిక పెట్రోల్ బంక్‌లో పనిచేసేవాడు. ఇతనికి భార్య కవిత(34), కుమారుడు లోకేశ్వరన్(7) ఉన్నారు. ఆదిమూలం మృతి చెందడంతో రాజేశ్వరి(65) కుమారుడు సంతోష్ వద్దే ఉంటోంది. గత కొద్ది రోజులుగా పనికి వెళ్లకుండా ఇంట్లోనే ఉన్న సంతోష్ కుమార్ రెండు రోజుల క్రితం పనికి వెళుతున్నట్లు చెప్పి వెళ్లాడు. తిరిగి రాకపోవడంతో కుటుంబ సభ్యులు అనేక ప్రాంతాల్లో గాలించారు. ఈ క్రమంలో శనివారం గ్రామంలోని జీడి మామిడి తోటలో చెట్టుకు ఉరేసుకుని కనిపించాడు. విషయం తెలుసుకున్న రాజేశ్వరి శనివారం మధ్యాహ్నం ఘటనా స్థలానికి చేరుకుని కుమారుడి మృతదేహాన్ని చూసి విలపించి కుమారుడు ఆత్మహత్య చేసుకున్న చెట్టుకే చీరతో ఉరేసుకొని బలవన్మరణానికి పాల్పడింది. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పోస్టుమార్టానికి తరలించి దర్యాప్తు చేపట్టారు.

కుంభకోణం బస్టాండులో యువకుడి ఆత్మాహుతియత్నం

క్రైం కార్నర్

గిండి, న్యూస్‌టుడే: కేరళం రాష్ట్రానికి చెందిన సుమన్ రాజ్(28) వ్యాయామశాల(జిమ్) నిర్వహిస్తున్నారు. ఆయనకు భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. ఇతను కుంభకోణం సమీపంలోని ఓ ప్రైవేటు పాఠశాలలో పనిచేస్తున్న ఉపాధ్యాయినిని ప్రేమించాడు. ఆమెతో ప్రేమ విషయాన్ని చెప్పగా నిరాకరించింది. మరో వ్యక్తితో వివాహ నిశ్చితార్థం జరిగిందని చెప్పింది. మనస్తాపానికి గురైన సుమన్‌రాజ్ ఆదివారం ఉదయం కుంభకోణం బస్టాండులో ఒంటికి నిప్పంటించుకున్నాడు. స్థానికులు మంటలార్పి పోలీసులకు సమాచారం ఇచ్చారు. వారు అక్కడకు చేరుకుని తీవ్రంగా గాయపడిన సుమన్‌రాజ్‌ను కుంభకోణం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

విమానాశ్రయంలో 2,960 గ్రాముల గంజాయి స్వాధీనం



వడపళని, న్యూస్‌టుడే: చెన్నై విమానాశ్రయానికి శుక్రవారం కౌలాలంపూర్ నుంచి వచ్చిన విమాన ప్రయాణికుల వద్ద కస్టమ్స్ అధికారులు తనిఖీలు చేపట్టారు. చక్రాల కుర్చీ సాయంతో ఓ ప్రయాణికుడు గ్రీన్ ఛానెల్ గుండా వెళ్లేందుకు ప్రయత్నించగా అడ్డుకుని లగేజీని క్షుణ్ణంగా పరిశీలించారు. 2,960 గ్రాముల గంజాయిని గుర్తించి స్వాధీనం చేసుకున్నారు. అతణ్ని అదుపులోకి తీసుకుని విచారిస్తున్నారు.